


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## రేపు వెలిగొండకు సీఎం చంద్రబాబు

- ఫీడర్ కెనాల్ పరిశీలన
- నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

- వివరాలు 4 లో..



# రాష్ట్రాలు వేరైనా.. రైతుల ప్రయోజనం ముఖ్యం

- తుంగభద్ర గేట్ల పునరుద్ధరణతో అన్నదాతలకు మేలు చేశాం
- మూడురాష్ట్రాల అభివృద్ధిలో కీలకం
- ఏపీ, కర్ణాటక, తెలంగాణ సీఎంల సమావేశం చారిత్రాత్మకం
- గంగా-కావేరి అనుసంధానం జరిగితే భారత్ అన్‌స్టాపబుల్
- హోస్పేట సభలో సీఎం చంద్రబాబు
- తుంగభద్ర నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభం
- హాజరైన కేంద్ర జలశాఖ మంత్రి పాటిల్

2



రాష్ట్రాలు వేరైనా రైతాంగ ప్రయోజనం ముఖ్యం.. అలాంటి సమున్నత ఆశయంతో తలపెట్టిన తుంగభద్రకు కొత్త గేట్ల ప్రక్రియ ఎంతో సంతృప్తినిచ్చింది.. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు.. వాటిని మనం పరిరక్షించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కర్నాటక రాష్ట్రం హెూస్పేటలో తుంగభద్ర గేట్లను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. రాష్ట్రాలు వేరైనా దేశంగా మనమంతా ఒక్కటే నని, రైతుల సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ప్రాజెక్టుల నిర్వహణ బావుంటేనే భవిష్యత్ తరాలకు నీటి భద్రత ఉంటుంది. నీటి విలువ తెలిసిన ప్రభుత్వంగా మా వంతుగా తుంగభద్ర డ్యామ్ పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి కొత్త గేట్లు ఏర్పాటు చేసి రైతుల ప్రయోజనాలు కాపాడామని వివరించారు. దేశ భవిష్యత్‌కు నదుల అనుసంధానం అవసరమని చెబుతూ గంగా- కావేరీ నదుల అనుసంధానం జరిగితే భారత్ అభివృద్ధి అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్యానించారు.




## అమరావతిలో బాలయ్య యాక్షన్

ప్రజా రాజధాని అమరావతిలో నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఎన్‌బీకే 112 భారీ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. వెలగపూడి బిట్స్ పిలానీ గ్రౌండ్‌లో సినిమా ప్రారంభోత్సవ వేడుకకు మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. అమరావతిలో సినిమా ప్రారంభోత్సవం నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామని, సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని లోకేష్ తెలిపారు.

5



# పకడ్బందీగా అధ్యాపక నియామకాలు

- వీలైనంత త్వరగా భర్తీ ప్రక్రియ పూర్తికి చర్యలు
- సెలక్షన్ కమిటీలకు స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వాలి
- స్కిల్ వర్సిటీలకు విధివిధానాలు రూపొందించాలి
- పీఎం సేతు కింద రాష్ట్రానికి 5 క్లస్టర్లు మంజూరు
- ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలి
- ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ సమీక్షలో లోకేష్



3


*రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్‌ను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో గురువారం సమీక్షించారు. వర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఇప్పటివరకు 1,89, 316 అప్లికేషన్లు వచ్చాయని అధికారులు చెప్పారు. వీలైనంత త్వరగా యూనివర్సిటీ అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని లోకేష్ సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌పై సమీక్షిస్తూ నైపుణ్యం పోర్టల్‌ను జూలైలో ఆవిష్కరించేందుకు చర్యలు తీసు కోవాలని సూచించారు.*

# మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు

- సీనియారిటీ జాబితా విడుదల
- నేటి నుంచి మండల, డివిజనల్,
- జిల్లా స్థాయిలో కౌన్సెలింగ్

*ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మునిసిపల్ యాజమాన్య పాఠశాలల్లో మిగులుగా తేలిన ఉపాధ్యాయులను అవసరం ఉన్న బదులకు సర్దుబాటు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 20వ తేదీ నాటికి నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు టీచర్లను గుర్తించి వారిని అవసరమైన చోట సర్దుబాటు చేస్తారు.*

4



## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

*మరో మూడు నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు నిచ్చారు. మంత్రాలయం నియోజకవర్గం మాధవరం గ్రామంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలి. 2029లో అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.*

చైతన్యరథం






## గంగా-కావేరి అనుసంధానంతో

# భారత్ అన్‌స్టాపబుల్

- తుంగభద్ర గేట్ల పునరుద్ధరణతో రైతుల ప్రయోజనాలు కాపాడాం
- ఏపీ, కర్ణాటక, తెలంగాణ సీఎంల సమావేశం చారిత్రాత్మకం
- మూడు రాష్ట్రాల అభివృద్ధిలో తుంగభద్ర కీలకం
- హోస్పేట బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇద్దరు సీఎంలతో తుంగభద్ర క్రస్ట్ గేట్ల ప్రారంభం
- హాజరైన కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్



హోస్పేట/కర్నాటక(చైతన్యరథం): కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి తుంగ భద్ర ప్రాంత రైతుల ప్రయోజనాలపై చర్చించడం చారిత్రాత్మక ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.రాష్ట్రాలు వేరైనా దేశంగా మనమంతా ఒక్కటేనని, రైతుల సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మూడు రాష్ట్రాల రైతులకు సాగు నీటిని, ప్రజలకు తాగునీటిని అందిస్తున్న తుంగభద్ర డ్యామ్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని చెప్పారు. 2024 ఆగస్టులో తుంగభద్ర ప్రాజెక్టులో 19వ నెంబరు గేటు కొట్టుకు పోవటంతో తక్షణం స్పందించి స్టాప్‌లాక్ గేట్ అమర్చామని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతులో భాగంగా రూ.51కోట్ల వ్యయంతో మొత్తం 33 కొత్త గేట్లను ఏపీ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వీటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ గేట్ల ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. తుంగభద్ర డ్యామ్‌లోని సీఎం చంద్రబాబు 19వనెంబర్ గేటు,కర్ణాటక ముఖ్యమంత్రి 18వ గేటును, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ 17వ గేటును, 20గేటును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముందు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్య మంత్రులు తుంగభద్ర ప్రాజెక్టు, జలాల వినియోగంపై సమావేశమయ్యారు. మూడు రాష్ట్రాల ప్రయోజనాలపై నలుగురు నేతలు విస్తృతంగా చర్చించారు.

### దేశ భవిష్యత్‌కు నదుల అనుసంధానం అవసరం

2024లో 19వ గేట్ కొట్టుకుపోయినప్పుడు స్టాప్ లాక్ గేట్ ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టామని, ప్రస్తుతం 33 క్రస్ట్ గేట్లను పునరుద్ధరించి ప్రాజెక్టును మరింత బలోపేతం చేశామని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేశాయని వెల్లడించారు. 'తుంగ భద్ర నది చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను గుర్తు చేశారు. విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి తుంగ భద్ర నది సహజ రక్షణ కవచంగా నిలిచిందన్నారు. జోగులాంబ ఆలయం, హంపీ విరూపాక్ష ఆలయం, మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వంటి పుణ్యక్షేత్రాలు ఈ నదీ తీరానే వెలిశాయని పేర్కొన్నారు.

దేశ భవిష్యత్తు కోసం నదుల అనుసంధానం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. కెన్-బేత్వా ప్రాజెక్టు ద్వారా ఉత్తర భారతదేశంలో నదుల అనుసంధానం విజయవంతంగా అమలవుతోందని, అదే తరహాలో గోదావరి-కావేరి అనుసంధానం జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరతాయని తెలిపారు. 1983లో ప్రధానితోపాటు నలుగురు ముఖ్యమంత్రులు కలిసి తమిళనాడుకు 5 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారని,ఉమ్మడి ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర అంగీకారంతో చెన్నైకి 15 టీఎంసీల తాగు నీటిని అందించామని గుర్తు చేశారు. గంగా - కావేరీ నదుల అనుసంధానం జరిగితే భారత్ అభివృద్ధి అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్యానించారు.

### నీటి వనరులు పొదుపుగా వినియోగించాలి

ఎల్‌నినో ప్రభావంతో జలాశయాలకు నీటి ప్రవాహాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముందుగా రాష్ట్రాలు అంతర్గతంగా నదుల అనుసంధానం చేపట్టి ఆ తర్వాత రాష్ట్రాల మధ్య అనుసంధానానికి అడుగులు వేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే అన్ని ప్రభుత్వాల ఉమ్మడి లక్ష్య మని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య జరిగిన ఈ సమావేశం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. అంతా కలిసి రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఆధునిక దేవాలయాలైన ప్రాజెక్టులను పరిరక్షించుకుంటే దేశాభివృద్ధికి అవి కీలకం అవుతాయని అన్నారు. ఈ సమావేశానికి ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహా మూడు రాష్ట్రాల స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.









చైతన్యరథం

## ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ

తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభానికి ముందు హోస్పే టలోని ఐఆర్‌బీ అతిథిగృహంలో ఏపీ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.







# పకడ్బందీగా అధ్యాపక నియామకాలు

- వీలైనంత త్వరగా భర్తీ ప్రక్రియ పూర్తికి చర్యలు
- సెలక్షన్ కమిటీలకు స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వాలి
- స్కిల్ వర్సిటీలకు విధివిధానాలు రూపొందించాలి
- పీఎం సేతు కింద రాష్ట్రానికి 5 క్లస్టర్లు మంజూరు
- ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలి
- ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ సమీక్షలో లోకేష్



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల రిక్రూ ట్‌మెంట్‌ను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివా సంలో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. వివిధ యూనివర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టులకు ప్రకటించిన ఫ్యాకల్టీ రిక్రూట్ నోటిఫి కేషన్ విడుదల తర్వాత వచ్చిన దరఖాస్తులపై అధికారులను వాక బు చేశారు. అధికారులు సమాధానమిస్తూ ఇప్పటివరకు 1,89, 316 అప్లికేషన్లు వచ్చాయని చెప్పారు. ప్రతి దరఖాస్తును డేటా డ్రివెన్ క్రాస్ వెరిఫికేషన్ చేయాల్సిందిగా మంత్రి సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రాత పరీక్షకు సంబంధించి ఇప్పటికే సిలబస్ ఇచ్చామని చెప్పారు. యూనివర్సిటీ యూనిట్‌గా రిక్రూట్ మెంట్ చేపడుతున్నందున సెలక్షన్ కమిటీలకు ఎంపిక ప్రక్రియపై స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వాలి. వీలైనంత త్వరగా యూనివర్సిటీ అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించి విధి విధానాల రూపకల్పనపై మంత్రి సమీక్షిస్తూ ఇండస్ట్రీ లింకేజీ, సెక్టార్ టై అప్ నిబంధన ఖచ్చితంగా ఉండాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని స్కిల్ యూనివర్సిటీల స్థాపనకు దేశంలోనే ఒక నమూనాగా ఈ చట్టం ఉండాలని సూచించారు.

### వచ్చే నెలలో నైపుణ్యం పోర్టల్ ఆవిష్కరణ

స్కిల్ డెవలప్‌మెంట్‌పై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ నిరుద్యోగ యువతకు మేలు చేకూర్చేలా తయారు చేసిన నైపుణ్యం పోర్టల్ ను జూలైలో ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో నమోదైన ప్రతి వ్యక్తికి ఆన్‌లైన్ స్కిల్ కార్డు జారీ చేస్తామని చెప్పారు. పీఎం సేతు పథకం కింద రాష్ట్రానికి 5 క్లస్టర్లు మంజూరయ్యాయి. ఇందులో స్టీల్, షిప్ బిల్డింగ్, పెట్రో కెమికల్ క్లస్టర్ ఏర్పాటుకు అర్సెలర్ మిట్టల్ సంస్థ ముందుకు వచ్చింది. రెన్యువబుల్ ఎనర్జీ, ఫార్మా, ఆక్వా, శ్రీసిటీ మొదలగు క్లస్టర్లలో కూడా పీఎం సేతు పథకం కింద ఐటీఐలను బలోపేతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇటీవల నాక్ ఆధ్వర్యంలో చేపట్టిన సెమినార్‌లో 92 నిర్మాణ సంస్థలు భాగ స్వామ్యం వహించాయి, సెయింట్ గోబెన్స్, అల్ట్రాటెక్ వంటి ప్రఖ్యాత సంస్థలు 5 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చాయని అధికారులు తెలిపారు.

### ఓంక్యాప్ ద్వారా విదేశాల్లో ఉద్యోగావకాశాలు

ఓంక్యాప్ ఆధ్వర్యంలో వచ్చే నెలలో 146 మందికి విదేశీ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఇందులో 84 మంది నర్సులు, 16 మంది బ్లూ కాలర్ అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. జపాన్‌లో హెల్త్ కేర్ వర్కర్లకు డిమాండ్ ఉన్నందున ఆ కోర్సులు చేసిన అభ్యర్థులకు అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలని లోకేష్ సూచించారు. క్వాంటమ్ ఏఐ స్కిల్లింగ్ ప్రణాళిక అమలు పురోగతిపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాబ్‌మేళాల ద్వారా ఇప్పటివరకు 1,30,422 మందికి ఉద్యోగాలు కల్పించామని అధికారులు వివరించారు. ప్రతి క్వార్టర్‌కు ఒకసారి నియోజకవర్గ కేంద్రాల్లో జాబ్‌మేళాలు నిర్వహించాలని లోకేష్ సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా రాష్ట్రస్థాయిలో స్టేట్ ఎంప్లాయ్‌మెంట్ ఆపరేటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి సెంట్రల్ కమాండ్ కంట్రోల్ ద్వారా మానిటర్ చేస్తున్నామని తెలిపారు. దీనికి అనుసంధానంగా డిస్ట్రిక్ట్ లెవల్ ప్లేస్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటుచేసి ప్లేస్‌మెంట్ ఆఫీసర్లను నియ మించనున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలో జిల్లాస్థాయి నైపు ణ్య అధికారుల సమావేశం నాటికి కేపీఐ డ్యాష్‌బోర్డును అందు బాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యశాఖ కమిషనర్ నారాయణ భరత్‌గుప్తా, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ఎండీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.






## మంత్రాలయం క్యాడర్‌తో సమీక్ష

*మంత్రాలయం నియోజకవర్గం మాధవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో సమీక్ష నిర్వహించారు.*

# ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు

- లక్ష మందికి పైగా విద్యార్థుల చేరిక
- సెప్టెంబర్ 5 నుంచి 9,10తరగతుల విద్యార్థులకు ఏఐ ట్యూటర్ విధానం అమలు
- మంత్రి లోకేష్‌కు వివరించిన అధికారులు
- హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టి సారించాలి
- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ఇతర రాష్ట్రాల విధానాలపై అధ్యయనం
- పాఠశాల విద్యపై సమీక్షలో మంత్రి ఆదేశం



అమరావతి(చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలల్లో ఈఏడాది విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టిసారించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ఈఏడాది 1,06,000 వేల మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వివరించారు. ముఖ్యం గా ప్రాథమికోన్నత పాఠశాలలు 7,620 ఉండగా.. 3,515 (46.13%) పాఠశాలల్లో గరిష్ఠ సామర్థ్యం మేర విద్యార్థుల ప్రవేశాలు పొందారని చెప్పారు. విద్యారంగంలో సంస్కరణల ఫలితంగానే విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయన్నారు. ఈ ఏడాది 159 పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా రూపాంతరం చెందాయని తెలిపారు.ప్రైవేటుపాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణపైనా సమావేశంలో చర్చించారు. అధిక ఫీజుల నియంత్రణకు ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈఏడాది సెప్టెంబర్ 5 నుంచి ఫేజ్-1 కింద 175 లీప్ పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి ఏఐ ట్యూట ర్ విధానాన్ని ప్రీ పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్‌లో క్లిక్కర్స్‌కు ఏఐ ట్యూటర్‌ను అనుసంధా నించాలని మంత్రి సూచించారు. ఐఈఆర్ పీఎస్ రెగ్యులరైజేషన్, హైస్కూల్ ప్లస్‌లలో గెస్ట్ లెక్చరర్ల రిక్రూట్‌మెంట్ అంశంపైనా సమావేశంలో చర్చించారు.

### త్వరలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీకి శంకుస్థాపన

అమరావతిలో స్టేట్‌సెంట్రల్ లైబ్రరీతో పాటు విశాఖలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటు పైనా సమావేశంలోచర్చించారు. ఇందుకు సంబంధించిన భవన నమూనాలను మంత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. వచ్చే నెలలో అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీకి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి (ఇన్‌ఛార్జి) శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేపు వెలిగొండకు సీఎం చంద్రబాబు

- గంటవానిపల్లి వద్ద ఫీడర్ కెనాల్ పరిశీలన
- అక్కడే సభ, నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

పెద్దదోర్నాల(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 27న శనివారం దోర్నాల మండలం గంటవానిపల్లెకు రానున్నారు. అక్కడే వెలిగొండ ఫీడర్ కెనాల్ పనుల పురోగతిని పరిశీలించనున్నారు. అనంతరం సభలో పాల్గొని ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం చెక్కులను అందజేయనున్నారు.ఈ మేరకు ఆయన పర్యటన ఖరారైంది. దీంతో అధికారులు ఏర్పాట్లను ప్రారంభించారు. హెలిప్యాడ్ ప్రాంతం, వాహనాల పార్కింగ్, సభాప్రాంగణం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ విజయసునీత విలేకరులతో మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు కేటాయించిన రూ.905.56 కోట్లలో మొదటి విడత రూ.300కోట్ల పరిహారం చెక్కులను అందజేసేందుకు సీఎం చంద్రబాబు ప్రాజెక్టువద్దకు వస్తున్నారని చెప్పారు. ఇప్పటికే రూ.80కోట్లు చెల్లించామని చెప్పారు.ఫీడర్ కెనాల్‌పనులను కూడా సీఎం పరిశీలిస్తారని తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ సీఎం పర్యటనకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.



# మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు

**నేడు సీనియారిటీ జాబితాల విడుదల**

**రేపు మండల స్థాయిలో కౌన్సెలింగ్**




అమరావతి(చైతన్యరథం): ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మునిసిపల్ యాజమాన్య పాఠశాలల్లో మిగులుగా తేలిన ఉపాధ్యా యులను అవసరం ఉన్న బడులకు సర్దుబాటు చేసేందుకు పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 20వ తేదీ నాటికి నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు టీచర్లను గుర్తించాలి. గతేడాది ఉపాధ్యాయుల పునర్విభ జనకు జారీ చేసిన ఉత్తర్వులను స్వల్పంగా సవరించి తాజాగా ఎంతమంది టీచర్లు అవసరమో సవరణ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ప్రకారం యూడైస్‌లోని విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా పిల్లలు తక్కువగా ఉన్న పాఠశాలల్లో మిగులు టీచర్లను, పెరిగిన పాఠశాలలకు ఎంతమందిని పంపాలనే లెక్కను తేల్చే బాధ్యతను పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయంలోని ఐటీ విభాగానికి అప్పగించారు. అక్కడ గుర్తించిన వివరాలను ధ్రువీకరించడమే ఇక్కడి మండల విద్యాధికారులు, జిల్లా ఉప విద్యాశాఖాధికారుల పని. పాఠశాలల్లో మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లు, మిగులుగా ఉన్న వారి వివరాలను ఎంఈవోల లాగిన్‌కు బుధవారం పంపారు. ఎంఈవోలు వాటిని పరిశీలించి ఏమైనా తేడాలు ఉంటే సవరించి డీఈవోలకు పంపాలి. డీఈవో ఆ వివరాలను పునఃపరిశీలించి ధ్రువీకరించి డైరెక్టర్ కార్యాలయ ఐటీ విభాగానికి పంపాల్సి ఉంది.పాఠశాల యాజమాన్యం, క్యాడర్ సబ్జెక్టు వారీగా సీనియారిటీ జాబితాలను గురువారం డైరెక్టర్ కార్యాలయ ఐటీ విభాగం తయారు చేసి ఎంఈవో లాగిన్‌కు పంపుతుంది.జాబితాల్లో ఏమైనా మార్పులు, చేర్పులు అవసరమైతే డీఈవో టిస్ డేటా ఆధారంగా మార్పులు చేసేందుకు అవకాశం ఇచ్చారు. శుక్రవారం ఎంఈవోలు తమ మండలాల్లో మిగులు టీచర్ల సీనియారిటీ జాబితాలను డౌన్‌లోడ్ చేసి నోటీసుబోర్డుల్లో ఉంచాలి. మండలంలో మిగులు టీచర్లను తమ కార్యాలయానికి పిలిపించి వారి సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి వారు కోరుకున్న స్థానాలను కేటాయించాలి. మండలస్థాయిలో పూర్తయ్యాక ఆ వివరాలను డీఈవోకు అందజేయాలి. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో స్థానాలు కోరుకున్న వారికి లీప్ యాప్ ద్వారా నియామక పత్రాలు జారీ చేస్తారు. 27న మండలాల్లో మిగిలిపోయిన టీచర్లను సర్దుబాటు చేసేందుకు డివిజనల్ స్థాయిలో సీనియారిటీ జాబితాలు తయారుచేసి 28వ తేదీన విద్యాధికారులు సర్దుబాటు చేస్తారు. 29న డివిజనల్‌స్థాయిలో మిగిలినటీచర్లను జిల్లా స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి మిగిలిపోయిన ఖాళీలను కేటాయిస్తారు. 30న మండల, డివిజన్,జిల్లాస్థాయిలో పని సర్దుబాటుచేసిన వారికి లీప్ యాప్ ద్వారా నియామక పత్రాలు జారీ చేస్తారు.

## ప్రభుత్వ ఉద్యోగాల స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణకు గడువు పొడిగింపు

అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగాల స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు ప్రభుత్వం మరింత సమయం కల్పించింది. పోస్టుల ఫ్రీజింగ్, కేడర్ మార్పులపై అమలులో ఉన్న పరిమితులను జూలై 5, 2026 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ఈ గడువు జూన్ 25తో ముగియాల్సి ఉండగా స్థానిక కేడర్ల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసేందుకు శాఖలకు అదనపు సమయం అవసరమని భావించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో కొత్త పోస్టుల సృష్టి, పోస్టుల అప్‌గ్రేడేషన్, పునర్విభజన వంటి ప్రక్రియలను చేపట్టేందుకు అవకాశం కల్పించింది. అలాగే శాఖల వారీగా డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (DPC) సమావేశాల ను త్వరితగతిన నిర్వహించి ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. ఇప్పటివరకు ప్రమోషన్లు ఇవ్వని విభాగాల్లో అర్హులైన ఉద్యోగులకు వెంటనే ప్రమోషన్ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వం సూచించింది. నాన్-సెలెక్షన్ పోస్టుల్లో అర్హత సాధించిన ఉద్యోగులకు కూడా పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అవసరమైన చోట బదిలీలు, డిప్యుటేషన్‌లు, అపాయింట్‌మెంట్ ట్రాన్స్‌ఫర్‌లకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, వాటికి అవసరమైన చోట ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేసింది. అన్ని శాఖల ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ఈ ప్రక్రియను వేగవంతం చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు సర్వీసెస్ అండ్ హెచ్ఆర్ఎం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్‌సింగ్ రావత్ పేరుతో సర్క్యులర్ జారీ అయింది. స్థానిక కేడర్ల ఏర్పాటు ప్రక్రియను సజావుగా పూర్తి చేయడానికే ప్రభుత్వం ఈ చర్యలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

చైతన్యరథం

# ఏపీలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషిచేస్తాం

**విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ - అమరావతిలో బాలయ్య 112 సినిమా - క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభోత్సవం**






అమరావతి(చైతన్యరథం): ఏపీలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషిచేస్తామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారిగా భారీ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. వెలగపూడిలోని బిట్స్ పిలానీ గ్రౌండ్‌లో జరిగిన నటసింహం నందమూరి బాలకృష్ణ 112 సినిమా ప్రారంభోత్సవ వేడుకకు లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ సినిమా ప్రారంభోత్సవానికి ఎప్పుడూ వెళ్లలేదు. అద్భుత అవకాశం ఇచ్చిన ముద్దుల మావయ్య జై బాలయ్యకు ధన్యవాదాలు తెలిపారు. బాలయ్య బాబు నాయకత్వం లో సినీ పరిశ్రమను ప్రజా రాజధాని అమరావతిలో పెద్దఎత్తున ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సినిమాతో

భవిష్యత్‌లో మరిన్ని సినిమాలు ఇక్కడి నుంచే




ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం పని చేస్తోంది. అమరావతిలో సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం మా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఇది పవిత్ర భూమి.

దుర్గేష్, సినీ దర్శకులు కొరటాల శివ, సినీ నిర్మాత చెరుకూరి సుధాకర్, ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ఎంఎస్ రాజుతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.









# రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి

- **సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అండగా ఉన్నారు**
- **ఏపీలో ఎన్నో అద్భుతమైన లొకేషన్లు**
- **అగ్రనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ**
- **అమరావతిలో ఘనంగా ఎన్‌బీకే 112 ప్రారంభం**

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని నందమూరి నటసింహం, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఏపీ రాజధాని అమరావతిలో బాలకృష్ణ 112వ చిత్రం గురువారం పూజా కార్యక్రమాలతో అత్యంత ఘనంగా ప్రారంభమయింది. రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి, బాలకృష్ణ అల్లుడు నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టారు. బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. పర్యాటకశాఖ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ కెమెరా స్విచ్‌ఆన్ చేశారు. క్లాప్ అనంతరం సినిమా డైలాగ్‌తో బాలకృష్ణ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, దర్శకుడు గోపీచంద్ మలినేనితోపాటు మరికొందరు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభించి, 2027 వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. సినిమా ఓపెనింగ్ కోసం వచ్చిన మంత్రులకు, ఈ సినిమా మొదటి షాట్‌ను డైరెక్ట్ చేసిన నందమూరి తేజస్వినికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సినిమాకి క్లాప్ కొట్టి 20 సంవత్సరాలు అయిందన్నారు. ఏపీలో పర్యాటక రంగం, సినీ పరిశ్రమ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని బాలయ్య తెలిపారు. ప్రస్తుతం అమరావతి అన్ని రంగాల్లో అభివృద్ధి




చెందుతోంది. ఏపీలోని మిగతా ప్రాంతాల్లోనూ చలనచిత్ర పరిశ్రమను ముందుకు తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ఈ సినిమా పూజా కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేశాం. అందరి సహకారంతోనే ఇండస్ట్రీ ముందుకు సాగుతోంది. ఏపీలో ఎన్నో అద్భుతమైన లోకేషన్స్ ఉన్నాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్ పుట్టిన నేల ఇది. ఈ నేలపై మనం సినిమా రంగాన్ని అభివృద్ధి చేద్దాం. అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

**పూర్వ వైభవం తెస్తాం: కందుల దుర్గేష్**

సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో అగ్ర నటుడు బాలకృష్ణ ప్రోత్సాహంతో ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేశామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. ఏపీలో షూటింగ్‌లే కాదు, స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్లు కూడా ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తోంది. సినిమా పరిశ్రమకు ప్రభుత్వ నుంచి సంపూర్ణ సహకారం ఉంటుంది. సినిమా అంటేనే గుర్తొచ్చేది విజయవాడే. అలాంటి విజయవాడ చిత్రపరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువస్తాంమని పేర్కొన్నారు.

**నా అదృష్టం: కొరటాల శివ**

అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు బాలయ్య బాబు కోసం ఒక సినిమా రాశానని దర్శకుడు కొరటాల శివ అన్నారు. రైటర్‌గా కూడా ఒక సినిమా రాసినట్లు చెప్పారు. ఇప్పుడు బాలయ్య బాబుకు దర్శకత్వం వహించడం తన అదృష్టమని శివ చెప్పుకొచ్చారు.

ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఎస్ఎల్‌వి సినిమాస్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నందమూరి బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు సరిగ్గా సరిపోయేలా, ఒక సరికొత్త కథాంశంతో ఈ సినిమాను పాన్-ఇండియా స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు నిర్మాత సుధాకర్ చెరుకూరి స్పష్టం చేశారు. ఈ క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం దాదాపు రూ.150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు బడ్జెట్ కేటాయిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. బాలయ్య కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ వ్యయంతో తెరకెక్కుతున్న చిత్రంగా నిలవనుంది.

బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు, సామాజిక సందేశాలను కమర్షియల్ అంశాలతో కలగలిపి అత్యంత శక్తిమంతంగా చూపించే కొరటాల శివ మార్క్ టేకింగ్ తోడవుతుండటంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గతంలో బాలకృష్ణ ఇండస్ట్రీ హిట్ చిత్రం 'సింహా' సినిమాకు కొరటాల శివ రచయితగా పనిచేశారు. ఆ సినిమాలో బాలయ్య డైలాగ్స్, క్యారెక్టరైజేషన్ ఎంతటి సంచలనం సృష్టించాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత వీరిద్దరూ దర్శకుడు - నటుడిగా చేతులు కలపడం నందమూరి అభిమానుల్లో పూనకాలు తెప్పిస్తోంది.

## ఏపీ వాణి రాజ్యసభలో వినిపిస్తా

**- చింతకాయల విజయ్**

**- రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం**



న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలను రాజ్యసభలో సమర్థవంతంగా వినిపిస్తూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని టీడీపీ రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ అన్నారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో రాజ్యసభ సభ్యుడిగా గురువారం విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడం తనకు ఎంతో గౌరవం ప్రదమైన, భావోద్వేగభరితమైన క్షణం అన్నారు. ఈ అపూర్వ అవకాశాన్ని కల్పించిన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌కి, పార్టీ అధినాయకత్వానికి, అలాగే తనపై విశ్వాసం ఉంచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటు న్నానన్నారు. అందరి ఆశీస్సులు, సహకారం ఎల్లప్పుడూ తనకు ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

## కాపులను పావులుగా వాడుకుంటున్న వైసీపీ

**- ఎమ్మెల్సీ సోము వీర్రాజు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): వైసీపీ రాజకీయ అవసరాల కోసం కాపులను పావులుగా వాడుకుంటోందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు విమర్శించారు. తూర్పు గోదావరి జిల్లా కేంద్ర రాజమహేంద్రవరంలో మీడియాతో సోము వీర్రాజు మాట్లాడుతూ.. కాపులకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తూ తెలుగు దేశం పార్టీ సముచిత గౌరవం ఇస్తుంటే వైసీపీ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. వైసీపీ హయాంలో కాపులకు ఏ మేర న్యాయం జరిగిందో, ఎంత గౌరవం దక్కిందో అందరికీ తెలిసిందేనన్నారు. కాపులను వైసీపీ వినియోగించుకుందని...గౌరవించలేదని విమర్శించారు. కాపులకు రిజర్వేషన్ ఇవ్వబోమని గతంలో జగన్ కరాఖండీగా చెప్పిన విషయాన్ని సోము వీర్రాజు గుర్తుచేశారు. జగన్ హయాంలో కాపులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. సమావేశాలు పెట్టి కాపులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. కాపులని చెప్పటానికి ఎవరూ భయపడక్కరలేదన్నారు. కాపులకు టీడీపీ హయాంలో తగిన ప్రాధాన్యత లభిస్తోందని సోము వీర్రాజు స్పష్టం చేశారు.

# పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

- **అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసా**
- **రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**
- **45 మందికి రూ.32.2 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**

రామచంద్రపురం (చైతన్యరథం): ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఒక వరం లాంటిదని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 45 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32.2 లక్షల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కష్టకాలంలో ఆదుకునే ఆపన్నహస్తమని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ



సహాయం గొప్ప భరోసానిచ్చే చర్యగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందేలా కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, కూటమి పార్టీ నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నవ్యాంధ్రలో సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ విప్లవం'

- **జూలైలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్**
- **సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**
- **స్థానిక యువత ప్రతిభకు రెక్కలు తొడిగేలా నిర్ణయం**
- **సినిమా మేకింగ్‌తో 'ఏఐ' అనుసంధానం..**
  **24 క్రాఫ్ట్స్‌పై ట్రైనింగ్‌కు 'జాడెక్స్' సంస్థ యాక్షన్ ప్లాన్!**



అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర రంగానికి సరికొత్త గ్లామర్, గ్లోబల్ టెక్నాలజీని అద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ'కి తెరలేపింది. ఏపీ యువతలోని సినిమా ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేస్తూ, ఫిల్మ్ డెవలప్‌మెంట్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చేలా జూలైలో 'క్రియేటివ్ ఎకానమీ'పై ఒక వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

గురువారం సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌ను 'జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్' ఫౌండర్ దివ్య కొనకళ్ల, కో-ఫౌండర్ శశికుమార్ పెయ్యాల మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ, ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించాలన్న వారి వినూత్న ప్రతిపాదనకు మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. తద్వారా ఔత్సాహిక చిత్ర నిర్మాతలు, నూతన కళాకారులు, సాంకేతిక నిపుణులు, రచయితలు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లకు సినిమా నిర్మాణంలోని అత్యాధునిక సాంకేతికతలను పరిచయం చేయవచ్చున్నారు. అంతేగాక పరిశ్రమ నిపుణుల పర్యవేక్షణలో వెండితెర అద్భుతాన్ని ఆవిష్కరించే 24 క్రాఫ్ట్సులో మెళకువలపై ఈ వర్క్‌షాప్‌లో ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. కథాభివృద్ధి, స్క్రీన్ ప్లే, ఏఐ సహాయక చిత్ర నిర్మాణం, తదితర అంశాలపై పాల్గొనే వారికి లైవ్ ఎక్స్ పీరియన్స్ అందిస్తామన్నారు.

ఆంధ్రప్రదేశ్ యువతలో అద్భుతమైన సృజనాత్మకత ఉంది. వారికి సరైన వేదిక, ఆధునిక సాంకేతికత తోడైతే టాలీవుడ్‌లో సరికొత్త సంచలనాలు సృష్టిస్తారు. ఈ క్రియేటివ్ ఎకానమీ వర్క్‌షాప్ ద్వారా స్థానిక టాలెంట్‌కు పెద్దపీట వేసి, ఏపీని సినిమా హబ్‌గా మారుస్తామని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అన్నారు.

జాడెక్స్ ఫౌండర్ దివ్య కొనకళ్ల మాట్లాడుతూ.. మంత్రి కందుల దుర్గేష్ విజనరీ ఆలోచనలకు తగ్గట్టుగా, ఈ వర్క్‌షాప్‌ను కేవలం థియరీ క్లాసుల్లా కాకుండా, ప్రతి ఒక్కరికీ ప్రాక్టికల్ అనుభూతిని ఇచ్చేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి పక్కా ప్రణాళిక

- **మంత్రి కందుల దుర్గేష్ స్పష్టీకరణ**
- **త్వరలోనే టూర్ ఆపరేటర్లు, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం**
- **సచివాలయంలో మంత్రి దుర్గేష్‌ని కలిసి పలు కీలక ప్రతిపాదనలు సమర్పించిన ఛాంబర్స్ బాధ్యులు**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధి బృందం గురువారం సచివాలయంలో మంత్రి దుర్గేష్ ని కలిసి రాష్ట్రంలో పర్యాటక రంగ బలోపేతానికి, పెట్టుబడుల ఆకర్షణకు సంబంధించిన పలు కీలక సూచనలతో కూడిన వినతిపత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ప్రగతిశీల కార్యక్రమాలను ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు కొనియాడారు. ముఖ్యంగా ఏపీ పర్యాటక విధానం 2024-29, ఏపీ పర్యాటక భూమి కేటాయింపు విధానం, కార్యాచరణ మార్గదర్శకాలు, బీచ్ షాక్స్ విధానం, 'హాలిడే ఇన్ ఏపీ / విజిట్ ఏపీ' గ్లోబల్ ప్రచారం, తదితర నిర్ణయాలు పర్యాటక రంగ పెట్టుబడిదారులలో నమ్మకాన్ని రెట్టింపు చేశాయని, ఆర్థిక వృద్ధికి బలమైన పునాది వేశాయని మంత్రి దుర్గేష్‌కు ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటక మంత్రిగా ఆయన పనితీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రంలో టూర్ ఆపరేటర్లు, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. రాబోయే సెప్టెంబర్‌లో నిర్వహించనున్న 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్' సమావేశానికి సంబంధించి అవసరమైన అధ్యయనం చేసి, నివేదికను సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. జూలై రెండవ వారంలో పర్యాటక శాఖతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఆ తదనంతరం తీసుకునే నిర్ణయాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి వారి మార్గదర్శకాలతో ముందుకు సాగుతామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

**పలు ప్రతిపాదనలు**

మంత్రి దుర్గేష్ కి ఏపీ ఛాంబర్స్ సమర్పించిన ప్రధాన ప్రతిపాదనలు పరిశీలిస్తే.. పరిశ్రమలు, హాస్పిటాలిటీ, ట్రావెల్, ఏవియేషన్, లాజిస్టిక్స్ రంగాలకు చెందినవి ఉన్నాయి. అంతే కాకుండా ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులతో టూరిజం స్టాక్‌హోల్డర్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 30 లక్షల మంది ప్రవాసాంధ్రులను భాగస్వాములను చేస్తూ, అంతర్జాతీయ రోడ్‌షోల ద్వారా 'విజిట్ ఏపీ' ప్రచారాన్ని గ్లోబల్‌గా ప్రమోట్ చేయాలని కోరారు. రూ.50 కోట్ల లోపు వ్యయంతో కూడిన ఎంఎస్ఎంఈ పర్యాటక ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేలా ఫాస్ట్ ట్రాక్ విధానం ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. హోమ్ స్టేల విషయంలో భద్రతా ప్రమాణాలతో కూడిన సింగిల్-విండో రిజిస్ట్రేషన్ ప్రక్రియను తెచ్చి, వాటిని పర్యాటక శాఖ అధికారిక పోర్టల్ ద్వారా ప్రమోట్ చేయాలన్నారు. ప్రైవేట్ భూముల్లో కొత్త సంస్థలు ప్రతిపాదించే ప్రాజెక్టులను పరిశీలించేటప్పుడు, ప్రమోటర్ల ఆర్థిక బలం, గత రికార్డులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. విజయవాడ - అమరావతి - సూర్యలంక - పాండురంగాపురం - ఓడరేవు - చీరాల బీచ్ కారిడార్, విశాఖపట్నం - అరకు లోయ సర్క్యూట్, గండికోట - బెలూమ్ గుహలు - యాగంటి, తదితర పర్యాటక సర్క్యూట్‌ల అభివృద్ధి, లేపాక్షి, గండికోట, బెలూమ్ గుహలకు యునెస్కో గుర్తింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలలో స్థానిక ప్రజలు, అధికారులు, ఆపరేటర్ల భాగస్వామ్యంతో డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కమిటీలు వేయాలని, ప్రత్యేక యాత్రా సర్క్యూట్‌ల కోసం రైల్వేలు, ఎయిర్‌లైన్స్, క్రూజ్ ఆపరేటర్లతో చర్చించాలని మంత్రి దుర్గేష్ కోరారు.

ఏపీ ఛాంబర్స్ చేసిన ప్రతిపాదనలపై మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న పర్యాటక ప్రతిపాదనల క్లియరెన్స్‌ను వేగవంతం చేస్తామని, పర్యాటక ప్యాకేజీల ప్రమోషన్ కోసం ఏపీ ఛాంబర్స్ నెట్‌వర్క్‌ను పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కర్ రావు, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.వి. స్వామి, రాష్ట్ర టూరిజం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, సలహాదారు లక్ష్మీనారాయణ, జీఆర్టీ హోటల్స్ జీఎం హరిప్రసాద్, సేల్స్ మేనేజర్ శ్రీకాంత్, హిరణ్య జర్నీస్ ప్రతినిధి కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.



ఉండవల్లి జోన్-11లో

## రూ.426 కోట్ల పనులకు ఆమోదం

*అమరావతి(చైతన్యరథం): ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. ఉండవల్లి జోన్-11 పరిధిలో ట్రంక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం రూ.426.46 కోట్ల వ్యయంతో భారీ మౌలిక సదుపాయాల పనులను చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు కింద రోడ్డు, డ్రైన్లు, సరఫరా, సెవరేజ్ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ సరఫరా, ఐసీటీ యుటిలిటీ డక్టు, రీయూజ్ వాటర్ లైన్ నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్‌టీపీ ఏర్పాటు, అవెన్యూ ప్లాంటేషన్ పనులను ఈ ప్యాకేజీలో భాగంగా అమలు చేయను న్నారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధికి అవసరమైన ఈ పనులను ప్యాకేజీ-38 కింద చేపట్టనున్నారు. ఎల్-1 బిడ్డర్‌గా ఎంపికైన ఎన్‌సీసీ లిమిటెడ్‌కు పనులను కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంచనా వ్యయం రూ.409.78 కోట్లు ఉండగా, 4.07 శాతం అధిక బిడ్‌కు అనుమతి ఇచ్చింది. ఈ కాంట్రాక్ట్‌కు రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌ను నిర్దేశించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి జూన్ 19న జరిగిన ఏపీసీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీర్మానం నెం.669/2026 ఆమోదం పొందింది. అనంతరం ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం.777ను జారీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది. పనుల అవార్డు జారీ చేసేందుకు ఏడీసీఎల్ సీఎండీకి అధికారాలను అప్పగించింది. ఉండవల్లి ప్రాంతంలో సమగ్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా రాజధాని నిర్మాణానికి మరింత వేగం చేకూరనుంది. ఈ ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులను ఏపీసీఆర్‌డీఏ సమకూర్చనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజధాని అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.*

## ప్రజాసేవే లక్ష్యం



- **అమరావతిలో వేగంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం**
- **2028కి తొలిదశ పూర్తి**
- **పనులు పరిశీలించిన ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ**

అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చెప్పారు. బాలయ్య నటిస్తున్న112వ సినిమా అమరావతిలో గురువారం ప్రారంభమయింది. అనంతరం అమరావతిలో బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులను బాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో బసవతారకం ఆస్పత్రిని ఇంకా విస్తరించే పనులు జరుగుతున్నాయన్నారు. అమరావతిలో కూడా బసవతారకం ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

2028లో మొదటి దశ పనులు పూర్తి అవుతాయన్నారు. బసవతారకం ఆస్పత్రి నిర్మాణం కోసం వర్కర్లు పగలు, రాత్రుళ్లు కూడా కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. వర్షాకాలం కావడంతో పనులు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతోనే ఈ ఆస్పత్రి నిర్మిస్తున్నామని బాలకృష్ణ పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడమే అసలు లక్ష్యం

- **ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**
- **ఎన్‌టీఆర్ జిల్లా దిశ కమిటీ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర పథకాల అమలుపై సమీక్ష**




విజయవాడ (చైతన్యరథం): ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడలోని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన దిశ (District Development Coordination and Monitoring Committee) సమావేశానికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన దిశ కమిటీ సభ్యులను జిల్లా యంత్రాంగానికి పరిచయం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడిన ఎంపీ చిన్ని, ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలులో దిశ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యం కాకుండా, పారదర్శకంగా అందేలా ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నూతన సభ్యులకు దిశానిర్దేశం చేశారు. పథకాలు ప్రకటించడం కాదనీ, ప్రజలకు చేరడమే అసలు విజయం అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టంచేశారు.

జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి వంటి అంశాలపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం స్పందిస్తూ పనిచేస్తోందని తెలిపారు.

జగ్గయ్య పేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం, నూతన కమిటీ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన దిశ కమిటీ సభ్యుడు మాదిగాని గురునాథం మాట్లాడుతూ, తనకు కమిటీలో సభ్యునిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.సమావేశంలో దిశ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లింగ్‌లో...

# సూత్రధారుల్ని వదలొద్దు



- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశం
- అటవీ సంపద పరిరక్షణ చర్యల్లో రాజీపడేది లేదు
- కూటమి పాలనలో 70 శాతం తగ్గిన స్మగ్లింగ్
- అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసిన టాస్క్ ఫోర్స్ బృందానికి అభినందనలు

అమరావతి (చైతన్యరథం): ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, స్మగ్లింగ్ ముఠాల వెనక ఉన్న పెద్ద తలకాయలను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా నార్పల మండలం, బొందలవాడ గ్రామ పొలిమేరలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ లో రూ. 2 కోట్ల విలువ చేసే 109 దుంగలు పట్టుబడ్డ విషయాన్ని అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రెడ్ శాండర్స్ స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్న నల్లాని నందకుమార్ అనే వ్యక్తితోపాటు మరో ఇద్దరిని టాస్క్ ఫోర్స్ అధికారుల అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో అసలైన సూత్రధారి ఆచూకీ తెలుసుకొని చర్యలు తీసుకోవాలని శ్రీ పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు ఎక్స్‌లో పవన్ పోస్ట్ పెట్టారు.

స్మగ్లింగ్ నిరోధానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా గడచిన రెండేళ్లలో ఎర్ర చందనం అక్రమ రవాణాలో 70 శాతం తగ్గుదల నమోదయిందన్నారు. అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వారి పట్ల కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఎర్ర చందనం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వారిలో సుమారు 90 శాతం పైగా శిక్షలు పడుతుండడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం. మన రాష్ట్ర సంపద అయిన ఎర్రచందనం రాష్ట్ర సరిహద్దు దాటకుండా ఉండేందుకు టాస్క్ ఫోర్స్ సాయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. అంతర్రాష్ట్ర సమన్వయంతో అక్రమ రవాణా నెట్వర్క్ లను ఛేదించే చర్యలను మరింత వేగవంతం చేస్తున్నామన్నారు. అనంతపురం జిల్లాలో అక్రమ రవాణా ముఠా కదలికలను గుర్తించి, పక్కా సమాచారంతో దాడి చేసి స్మగ్లర్ల ఆటకట్టించిన ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళాన్ని పవన్ కళ్యాణ్ అభినందించారు. ఈ ఆపరేషన్‌లో ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం పాల్గొన్నట్లు అధికారులు వివరించారు. ఎస్పీ సుబ్బారాయుడు నేతృత్వంలో, ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధక దళం ఎస్పీ పి. శ్రీనివాస్, అడిషల్ ఎస్పీ కులశేఖర్, ఎసీఎఫ్ జె శ్రీనివాస్, డీఎస్పీ వి. శ్రీనివాస్ రెడ్డి, అనంతపురం డీఎఫ్ఓ చక్రపాలి ఆధ్వర్యంలో చేపడుతున్న ఎర్ర చందనం స్మగ్లింగ్ నిరోధక చర్యలను అధికారులు వివరించారు.

# దివంగత ఎర్రన్న ఆశయాల మేరకు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

- చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పథంలో రాష్ట్రం
- గొడ్డలి పార్టీకి అభివృద్ధి కంటే విద్వేష రాజకీయాలే ముఖ్యం
- మెగా డీఎస్సీపై అసత్య ప్రచారం
- చర్చకు రావాలన్న మంత్రి లోకేష్ సవాల్‌కు తోక ముడిచిన గొడ్డలి పార్టీ అధ్యక్షుడు
- వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో మంత్రి విస్తృత పర్యటన



సంతబొమ్మాళి (చైతన్యరథం): దివంగత నేత ఎర్రన్నాయుడు ఆశయాలతో గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం బోరుభద్ర పంచాయతీలో మంత్రి అచ్చెన్నాయుడు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం గురించి ఆలోచించకుండా విద్వేషాలు, విద్రోహ రాజకీయాలనే ఆ పార్టీ నమ్ముకుందని విమర్శించారు. మెగా డీఎస్సీ అంశంపై చర్చకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ బహిరంగ సవాల్ విసిరినా, గొడ్డలి పార్టీ అధ్యక్షుడు స్పందించకపోవడం ఆయనకు చిత్తశుద్ధి లేదనే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసమే డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. అత్యంత సంక్లిష్టమైన డీఎస్సీ నియామక ప్రక్రియను మంత్రి నారా లోకేష్ సమర్థవంతంగా నిర్వహించి, కేవలం మూడు నెలల్లోనే నియామక ప్రక్రియను పూర్తి చేయడం చారిత్రాత్మక విజయమని కొనియాడారు.

### అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

రాజకీయ ప్రయోజనాల కోసం కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేయడం గొడ్డలి పార్టీ నాయకత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం కాకుండా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

### వంశధార ఆధునికీకరణకు నిధులు

వంశధార ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణకు ఇప్పటికే రూ.10 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలనే లక్ష్యంతో చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసి, జిల్లా రైతులకు ఏడాదికి మూడు పంటలు సాగు చేసుకునేలా సమృద్ధిగా సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు.

### ఎర్రన్న ఆశయాలే మార్గదర్శకం

దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు ఈ ప్రాంతమంతా సైకిల్‌పై పర్యటిస్తూ గ్రామీణ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, మౌలిక సదుపాయాల కల్పనకు విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

### చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పరుగులు

సమర్థవంతమైన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి కల్పన రంగాల్లో వేగంగా ముందుకు దూసుకెళ్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

### ప్రతి పల్లెకు మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యం

పల్లెల్లో రవాణా కష్టాలను శాశ్వతంగా పారదోలాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో ప్రతి పల్లెకు నిరంతర తాగునీరు, పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా అధికార యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి రథచక్రాలు వేగంగా ముందుకు సాగుతాయని, నియోజకవర్గంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిలో స్థానికులు సైతం చురుగ్గా పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

### రూ.10 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

బోరుభద్ర గ్రామానికి చేరుకున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, తొలుత దివంగత నేత ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో సుమారు రూ.10 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 అడుగుల ప్రధాన రహదారితో పాటు, రామాలయం వద్ద మరో రూ.2.5 కోట్లతో, బస్టాండ్ వద్ద ఇంకో రూ.2.5 కోట్లతో నిర్మించిన ప్రధాన సిమెంట్ రహదారులను ఆయన ప్రారంభించారు. అలాగే డీపీఎన్ రోడ్డు నుంచి వెటర్నరీ ఆసుపత్రి మీదుగా పీహెచ్‌సీ వరకు రూ.3.5 కోట్లతో నిర్మించిన భారీ రహదారిని, రూ.64 లక్షల అంచనా వ్యయంతో బోరుభద్ర బీటీ రోడ్డు నుంచి వజ్జ కోదండరాం బ్రిడ్జి మీదుగా మార్పు కృష్ణారావు ఇంటి వరకు, రూ.76 లక్షల వ్యయంతో వల్లభ గణపతిరావు ఇంటి నుంచి బొడ్డ సూర్యనారాయణ ఇంటి వరకు, రూ.47 లక్షలతో గోదలాం ఐటీఐ రోడ్డు నుంచి డీపీఎన్ రోడ్డు వరకు పూర్తయిన సీసీ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు.

### నూతన రోడ్లు, మంచినీటి పథకానికి శంకుస్థాపన, ప్రారంభోత్సవం

వీటితో పాటు బోరుభద్ర మెయిన్ రోడ్డు నుంచి మలగాం రోడ్డు వరకు నిర్మించిన రింగ్ రోడ్డు, మలగాం రోడ్డు నుంచి వల్లభ గణపతి ఇంటి వరకు, మేఘవరం రోడ్డు నుంచి డీపీఎన్ రోడ్డు వరకు, రజకవీధి, కుమ్మరవీధి, ఎస్సీ కాలనీ పరిసరాల్లో నిర్మించిన పలు సిమెంట్ రహదారులను, నూతన డ్రైనేజీ వ్యవస్థను మంత్రి అందుబాటులోకి తెచ్చారు. ఇదే క్రమంలో రింగ్ రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఆర్‌డబ్ల్యూఎస్ రక్షిత మంచినీటి పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధిలో మరింత వేగం పెంచుదాం

**- రాజ్యసభ కొత్త సభ్యులతో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**



న్యూఢిల్లీ: ఏపీ నుంచి రాజ్యసభకు నూతనంగా ఎన్నికైన నలుగురు ఎంపీలు గురువారం పార్లమెంట్ భవనంలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కలిశారు. ప్రమాణ స్వీకారం చేసిన భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, సానా సతీష్, లింగమనేని రమేష్‌లను కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తన నివాసానికి ఆహ్వానించి, సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కారు వెసులుబాటును వినియోగించుకుని రాష్ట్రాభివృద్ధిలో మరింత వేగం పెంచుదామన్నారు. రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై పెద్దల సభలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, ఉదయ్ శ్రీనివాస్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోంది: ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం (చైతన్యరథం): పేద ప్రజల వైద్య అవసరాలను తీర్చడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నిరంతరాయంగా కొనసాగిస్తోందని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. విశాఖపట్నంలోని లాసన్స్ బే కాలనీలో గల తన కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి వెంకట అప్పారావుకు రూ.46,225, వాకాడ వెంకటేశ్వరరావుకు రూ.70,918, జెర్రు అప్పలరెడ్డికి రూ.41,500, నీలి వెంకటలక్ష్మికి రూ.45,565 చొప్పున మొత్తం రూ.2,04,208 విలువైన చెక్కులను ఎంపీ శ్రీభరత్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన వారికి సకాలంలో ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన ఎంపీ శ్రీభరత్, ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని లబ్ధిదారులకు ఆకాంక్షించారు.


## దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి : ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అతిది



విజయనగరం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, విజయనగరం పైడితల్లి అమ్మవారు ఆలయ నూతన శిఖర ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం గురువారం ఉదయం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు విఘ్నేశ్వర పూజల్లో పాల్గొన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరుగుతున్న ఈ కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, ఎస్పీ ఏ.ఆర్ దామోదర్, ఆలయ ఈవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

## క్యాడర్ మీటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

**●కార్యకర్తలే పార్టీ బలానికి మూలస్తంభాలు**




పాతపట్నం (చైతన్యరథం): శుక్రవారం పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన క్యాడర్ మీటింగ్‌లో శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం అని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజలకు చేర్చాలని సూచించారు. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల కృషి వలననే భవిష్యత్తులో పార్టీకి మంచి ఫలితాలు వస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.అలాగే, నాయకత్వంపై విశ్వాసం ఉంచుకుని సమిష్టిగా ముందుకు సాగితే పార్టీకి విజయాలు ఖాయం అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల మధ్య విశ్వాసాన్ని పెంచే విధంగా వ్యవహరించాలని సూచించారు."ప్రజల మద్దతే పార్టీకి ప్రాణం... కార్యకర్తలే ఆ బలానికి ఆధారం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయండి.. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించండి

**●ప్రతి ఓటు విలువైనదే.. సర్ ప్రక్రియను విజయవంతం చేయాలి**

**●ఓటరు జాబితా సవరణలో బీఎల్వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలి**

**●యూనిట్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలతో ప్రత్యేక సమావేశం**

**●రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి (చైతన్యరథం): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుత ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల పరిధిలోని క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ ఇన్‌చార్జీలు, బీఎల్ఏలతో ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సర్వే చేపట్టిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఎల్వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. 2002లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల వివరాలు, ప్రస్తుతం నమోదైన ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో మ్యాపింగ్ చేయాలని చెప్పారు. ప్రతి ఓటు అత్యంత విలువైనదని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.

మ్యాపింగ్ ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం లేదా లోపాలు గమనించినట్లయితే వెంటనే పార్టీ నాయకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 86 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రక్రియ తొలి దశ త్వరలో పూర్తవుతుందని, రెండో దశలో ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి కొత్త ఎన్యుమరేషన్ ఫారాల్లో నమోదు చేసి, ధృవీకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. సమయం దగ్గరపడుతున్నందున నాయకులు, కార్యకర్తలు మరింత సమయం కేటాయించి ప్రక్రియను పూర్తిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికీ ఓటు ఎంతో విలువైనదని గుర్తుంచుకోవాలని సూచించారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం బూత్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, మండల నాయకులు, బీఎల్ఏలు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. తద్వారా పార్టీ బలోపేతంతో పాటు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అంశాలపై చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### ఓటరుగా నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓట్ల చేరికలు, మార్పులు, సవరణలు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని మంత్రి సూచించారు. రెండు దఫాల మ్యాపింగ్ పూర్తయ్యేలోగా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటరుగా నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ఓట్ల నమోదు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైందని, అదే ఎన్నికల వ్యూహాలు, ప్రణాళికలకు పునాదిగా ఉంటుందని వివరించారు.

### ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల కాలంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేలా కృషి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. నాలుగు మండలాల యూనిట్ ఇన్చార్జులు, క్లస్టర్ ఇంచార్జులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ పనుల్లో నాణ్యత లేకుంటే విజిలెన్స్ విచారణ



ఏలూరు (చైతన్యరథం): ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో మరింత జవాబుదారీతనంతో పనిచేయాలని ఏలూరు పార్లమెంట్ సభ్యుడు మహేష్ కుమార్ యాదవ్ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ మహేష్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ తదితరులు పాల్గొన్నారు. గత సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలు, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో ఎంపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతున్నాయని, వాటిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజల సమస్యలకు సంబంధించి తాను పంపిస్తున్న వినతులు, అర్జీలపై కొన్ని శాఖల అధికారులు స్పందించకపోవడం, కనీసం సమాధానం కూడా ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. తనకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే సామాన్య ప్రజలకు ఎలాంటి సేవలు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇకపై ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

### రైల్వే స్టేషన్ పనులపై అసంతృప్తి

ఏలూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులపై ఎంపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిపాదనల సమయంలో ఎయిర్‌పోర్ట్ తరహాలో అభివృద్ధి చేస్తామని చూపించిన త్రీడీ నమూనాలకు, ప్రస్తుతం జరుగుతున్న పనులకు ఎలాంటి పోలిక లేదన్నారు. మొదటి దశలో రూ.12 కోట్లతో చేపట్టిన పనుల్లో నాసిరకం మెటీరియల్ వినియోగించారని ఆరోపించారు. ఎయిర్‌పోర్ట్ తరహా స్టేషన్‌కు బదులుగా గెస్ట్ హౌస్ మాదిరిగా మాత్రమే నిర్మాణాలు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికుల విశ్రాంతి గదులు, వసతి సదుపాయాలు, మరుగుదొడ్లు వంటి అంశాలను పట్టించుకోలేదని విమర్శించారు. రానున్న 20 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త స్టేషన్ మాదిరిగా ఆధునికీకరణ పనులు చేపట్టాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే విజిలెన్స్ విచారణకు సిఫారసు చేస్తానని రైల్వే అధికారులను హెచ్చరించారు.

# పుష్కరాలు నేపథ్యంలో పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలి

**● అధికారులకు సూచనలు చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజస్థాని సేవా సమితి ప్రతినిధుల అభ్యర్థన మేరకు పక్షులకు నిత్యం ఆహారం (బర్డ్ ఫీడింగ్) అందించే ఏర్పాట్ల కోసం గోదావరి గట్టుపై అనువైన ప్రదేశాలను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి పరిశీలించారు. రానున్న పుష్కరాలు నేపథ్యంలో అలాగే గోదావరి గట్టు వెంట ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా, పక్షులు సురక్షితంగా చేరుకునే విధంగా ఏయే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయనే అంశంపై అధికారులు, సదరు సమితి ప్రతినిధులతో కలిసి చర్చించారు. పక్షులకు ఆహారం అందించడం జీవకారుణ్యానికి ప్రతీకని, నగరంలో ఇటువంటి సేవా కార్యక్రమాలకు తగిన సహకారం అందించేందుకు నగరపాలక సంస్థ సానుకూలంగా వ్యవహరిస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. పరిశీలన అనంతరం సాంకేతిక అంశాలు, ప్రజా సౌకర్యాలు, పరిశుభ్రత ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని తుది నిర్ణయం తీసుకుని అవసరమైన ఏర్పాట్లు చేపడతామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, రాజస్థాని సేవా సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి నియోజకవర్గంలో స్త్రీ శక్తి కార్యక్రమంలో భాగంగా మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం 80వ బ్యాచ్ విజయవంతంగా పూర్తయింది,ఈ సందర్భంగా మంగళగిరి టౌన్ మరియు మంగళగిరి రూరల్ ప్రాంతాలకు చెందిన 30 మంది మహిళలకు 60 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించి, శిక్షణ పూర్తిచేసిన వారికి గురువారం మంగళగిరి నియోజకవర్గం టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో సర్టిఫికెట్లు మరియు ఉచిత కుట్టు మిషన్లను అందజేశారు. మంగళగిరి నియోజకవర్గ మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీమతి ఆరుద్ర భూలక్ష్మి తెలిపారు,మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే వేలాది మంది మహిళలు ఈ శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పొందుతూ తమ కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని ఆమె తెలిపారు. మహిళా సాధికారతకు మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి ఆదర్శనీయమని భూలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం లో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఊట్ల దుర్గామల్లేశ్వరి, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులు వాస పద్మావతీ, మండల మహిళా ప్రధాన కార్యదర్శి అప్పల శాంతి, నియోజకవర్గ అంగన్వాడీ సెల్ ఉపాధ్యక్షులు మోతుకూరి సుజాత, పట్టణ మహిళా కార్యదర్శి వెలుగోటి అన్నపూర్ణ, ట్రైనర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పోలియో డ్రైవ్ విజయవంతం చేయడం మనందరి సామాజిక బాధ్యత

**●28న గుడివాడలో నేషనల్ పల్స్ పోలియో డ్రైవ్**

**●పోలియో ప్రచార బ్యానర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాము**




గుడివాడ (చైతన్యరథం): పోలియో డ్రైవ్‌ను విజయవంతం చేయడం మనందరి సామాజిక బాధ్యత" అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.పోలియో రహిత సమాజం కోసం, భవిష్యత్ తరాల ఆరోగ్యం కోసం పోలియో డ్రైవ్ ను ప్రభుత్వాలతో పాటుగా మనందరం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందాం" అని పిలుపునిచ్చారు. ఈనెల 28వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నేషనల్ పల్స్ పోలియో డ్రైవ్‌ను విజయవంతం చేసేందుకు గుడివాడలో అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఇందులో భాగంగా పీపీ యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన పోలియో చుక్కల, క్లాత్ బ్యానర్లను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం సాయంత్రం ప్రజావేదిక కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీడీఓ డాక్టర్ శ్వేత మాట్లాడుతూ, గుడివాడ పట్టణంలో పోలియో డ్రాప్స్ కార్యక్రమ ఏర్పాట్లు పూర్తయ్యాయని, 27వ తేదీన అవగాహన ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతానికి కూటమి శ్రేణులు కూడా క్షేత్రస్థాయిలో పనిచేస్తాయని ఎమ్మెల్యే రాము వైద్యాధికారులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరన్నారు. ఒక్క చిన్నారినీ కూడా వదిలిపెట్టకుండా తల్లిదండ్రులు బాధ్యతగా తమ సమీప కేంద్రానికి తీసుకెళ్లాలనీ పిలుపునిచ్చారు. “ఉదయం 7 గంటలకే పోలియో డ్రైవ్ ప్రారంభం అవుతుందనీ, గుడివాడ పట్టణంలో 60 కేంద్రాలతో పాటు రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో ప్రయాణికుల కోసం ట్రాన్సిట్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, మారుమూల కాలనీల కోసం 5 మొబైల్ బృందాలు ఇంటింటికీ వెళతాయనీ ఎమ్మెల్యే రాము తెలిపారు.

# సర్ కార్యక్రమంలో కూటమి శ్రేణులు భాగస్వాములు కావాలి : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పిలుపు నిచ్చారు. వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికా వెళ్లిన యార్లగడ్డ గురువారం పత్రికా ప్రకటన విడుదల చేసారు. గన్నవరం నియోజకవర్గంలో ‘సర్’ కార్యక్రమం విజయవంతం చేసేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలు అందేలా చూడటంతోపాటు, ఓటర్లు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను బిఎల్ఓలకు అందించే వరకు ఫాలోఅప్ చేయాలన్నారు. ఎన్యూమరేషన్ అధికారులు, బిఎల్ఓలతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ వారి సూచనలను పాటిస్తూ అర్హుల ఓట్లు తొలగించకుండా తగు జాగ్రత్త వహించటంతోపాటు మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు తొలగించేలా చూడాలని కూటమి శ్రేణులను యార్లగడ్డ కోరారు. 18 ఏళ్ళు నిండిన వారిని ఓటరుగా చేర్పించాలని, నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు

**●జిల్లా సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**




విజయవాడ (చైతన్యరథం): జిల్లా సమన్వయ అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతన్నామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వ్యాఖ్యానించారు. గురువారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సమన్వయ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరా రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సమావేశంలో ప్రస్తావించి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తండ్రి ఆశయాలకు తిలోదకాలు ఇచ్చి... ఇప్పుడు వారసుడినంటావా?

**●దేవినేని అవినాష్‌పై టీడీపీ నేత పట్టాభిరామ్ ఫైర్**



విజయవాడ (చైతన్యరథం): “దేవినేని నెహ్రూ పేరు చెప్పుకుని రాజకీయాలు చేయొచ్చు కానీ ఆయన ఆశయాలను, విలువలను, రాజకీయ నిబద్ధతను మోసం చేసి వారసుడినని చెప్పుకోవడం సాధ్యం కాదు” అంటూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ దేవినేని అవినాష్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పట్టాభిరామ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దేవినేని నెహ్రూ గతంలో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబునాయుడు, అమరావతి అభివృద్ధి గురించి చేసిన ప్రసంగాల వీడియోలను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడిన పట్టాభిరామ్... “ఒకవైపు తండ్రి చెప్పిన మాటలు ఉన్నాయి... మరోవైపు కొడుకు చేస్తున్న రాజకీయాలు ఉన్నాయి. రెండింటినీ ప్రజలు చూసి తీర్పు చెప్పాలి” అని వ్యాఖ్యానించారు.

**తండ్రి టీడీపీని సొంత ఇల్లు అన్నాడు... కొడుకు అదే ఇంటిపై దాడికి వెళ్లాడు!**

దేవినేని నెహ్రూ స్వయంగా “తెలుగుదేశం పార్టీ నా సొంత ఇల్లు” అని ప్రకటించారని గుర్తు చేసిన పట్టాభిరామ్, జీవితాంతం పార్టీ కోసం పనిచేసిన నాయకుడి కుమారుడు నేడు అదే పార్టీపై విమర్శలు చేయడం పిల్ల చేష్టలన్నారు. “నెహ్రూ చివరి వరకు టీడీపీ జెండాను గౌరవించారనీ, కానీ ఆయన కుమారుడు మాత్రం అధికారం కోసం పార్టీలు మారుతూ రాజకీయ ప్రయాణం చేస్తున్నాడన్నారు. తండ్రి సంపాదించిన గౌరవాన్ని నిలబెట్టాల్సింది పోయి,ఆయన ఆశయాలనే తుంగలో తొక్కేశాడు” అంటూ మండిపడ్డారు.

**చేపకు నీళ్లు ఎంత అవసరమో... అవినాష్‌కు అధికారం అంత అవసరం!”**

అధికారం లేకుండా రాజకీయాలు చేయలేని నాయకుడు దేవినేని అవినాష్ అని పట్టాభిరామ్ ఎద్దేవా చేశారు. చేపను నీళ్లలో నుంచి బయటకు తీస్తే ఎలా కొట్టుకుంటుందో, అధికారం లేకపోతే అవినాష్ కూడా అలాగే అల్లాడిపోతాడన్నారు. అందుకే ఇప్పటికే 3పార్టీలు మారాడు, వైసీపీ ఓడిపోయాక కూడా మరో రాజకీయ ఆశ్రయం కోసం వెతికాడు. అవకాశం దొరకకపోవడంతో ఇప్పుడు జగన్ వద్ద మార్కులు కొట్టేందుకు చంద్రబాబు, లోకేష్‌లపై విమర్శలు చేస్తున్నాడు” అని ఆరోపించారు.

**క్యాసినో కనిపించలేదు... ఇప్పుడు జూదంపై జ్ఞానోదయమా?**

గుడివాడ క్యాసినో వ్యవహారాన్ని ప్రస్తావించిన పట్టాభిరామ్, అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తినా అవినాష్ స్పందించలేదన్నారు. గుడివాడలో క్యాసినో నడిచినప్పుడు కనిపించలేదు,. అధికారంలో ఉన్నప్పుడు నోరు మూసుకుని... ఇప్పుడు జూదం, పేకాట అంటూ నీతులు చెప్పడం ప్రజలు గమనిస్తున్నారు” అని వ్యాఖ్యానించారు.

**బుడమేరు మట్టి దోపిడీ ఎవరిదో ప్రజలకు బాగా తెలుసు!**

బుడమేరు వరదలు, మట్టి అక్రమ రవాణా అంశాలను ప్రస్తావిస్తూ పట్టాభిరామ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజలు వరదలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో కొందరు మాత్రం ఖజానాలు నింపుకున్నారన్నారు.. మట్టి మాఫియాల వెనుక ఎవరు ఉన్నారో ప్రజలకు తెలుసనీ ఇప్పుడు అదే వ్యక్తులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉంది” అన్నారు.

## విజయ శిఖరాలకు జాబ్ మేళా తొలి మెట్టు

● విద్యార్థులు సిల్క్ కమ్యూనికేషన్స్ మెరుగుపరుచుకోవాలి

●మెగా జాబ్ మేళాలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): యువత నైపుణ్యానికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, మెగా జాబ్ మేళా యువత విజయ శిఖరాలకు తొలి మెట్టు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో స్థానిక కొడిగుడ్డు సత్రంలోని వెల్ఫేర్ హాస్టల్లో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పని చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రానికి లక్షల కోట్లతో పరిశ్రమలు తీసుకొచ్చారని చెప్పారు. యువత చదువులకు తగిన ఉద్యోగాల కల్పనకు తగిన అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఇది నిరుద్యోగులకు మంచి అవకాశమని తెలిపారు.

**1015 మందిపైగా హాజరు.. 307 మందికి ఉద్యోగాలు**

జాబ్ మేళాలో ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, రిటైల్, ఆటోమొబైల్ సేవా రంగాలకు చెందిన సుమారు 20కిపైగా ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. మెడ్‌ప్లస్, వరుణ్ మోటార్స్ వంటి ప్రసిద్ధ సంస్థలు ప్రతినిధులను అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూ చేశారన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన అభ్యర్థులకు ఈ మేళాలో అవకాశాలు కల్పించామని చెప్పారు. మొత్తం 1015 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 307 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా సీఎంఆర్ఎఫ్

●రూ.3.75 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొండా



విజయవాడ (చైతన్యరథం): ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తుందని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. గురువారం నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... 64వ డివిజన్ కండ్రిక ప్రాంతానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.3.75 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని, తీవ్రమైన అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్సల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటనిస్తుందన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించే నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయనిధిని మరింత వేగంగా ప్రజలకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా న్యాయం జరిగేలా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే బొండా ఉమా తెలిపారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌కు చెందిన యువకుడు గుంజా రాజు (24) ప్రమాదవశాత్తు మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న వారి కుటుంబాన్ని పరామర్శించి, మృతుడి తండ్రి గుంజా పుల్లారావుకి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సహాయనిధి నుంచి రూ.1,00,000 చెక్కును అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, మృత కార్యకర్త కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేసిన గద్దె క్రాంతి కుమార్

విజయవాడ (చైతన్యరథం): కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం ప్రతి నాయకుడి బాధ్యత అని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. వైద్య చికిత్స పొందుతున్న ఇద్దరు పార్టీ కార్యకర్తల గోపాలదాసు రమణయ్యకు, షేక్ బాషాలకు వైద్య ఖర్చుల నిమిత్తం చెరొక 10 వేలు చొప్పున రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం ఉదయం అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గద్దె క్రాంతికుమార్ అందజేశారు.

## సమర్థవంతంగా వ్యర్థ నిర్వహణ : చైర్మన్ పట్టాభిరామ్

●విజయవాడ నగరంలోని చెత్త జిందాల్ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్‌కు తరలింపు

●ఆటోనగర్‌లో కంపాక్టర్‌ని ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ నగరంతోపాటు ఆటోనగర్‌లో రోజూ వచ్చే చెత్తని జిందాల్ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్‌కు తరలించే ఏర్పాటు చేసినట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ చెప్పారు. ఆటోనగర్‌లో నూతన కంపాక్టర్‌ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ... మెరుగైన చెత్త సేకరణ, సమర్థవంతంగా వ్యర్థ నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతకు ఈ కంపాక్టర్ ఉపయోగపడుతుందన్నారు. 42 క్యూబిక్ మీటర్ల ఈ కంపాక్టర్‌కు 50 శాతం నిధులను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అందించినట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు గద్దె రామమోహన్ రావు, తమ పార్టీ యువనేత గద్దె క్రాంతి కుమార్, ఆటోనగర్ అసోసియేషన్, ఐలా పెద్దలు ఇక్కడి చెత్త సమస్యను తన దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ సమస్య పరిష్కారం విషయమై వారు తనతో చర్చించినట్లు తెలిపారు. ఆటోనగర్ ప్రాంతంలోని చెత్తని జిందాల్ ప్లాంట్‌కు తరలించే విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. సమస్య తనకు తెలిసిన వెంటనే జిందాల్ ప్లాంట్ వారితో, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతిరోజూ 10 నుంచి 12 టన్నుల చెత్త వస్తుందని, ఆ మొత్తాన్ని జిందాల్ ప్లాంట్‌కు తరలించడానికి వారితో మాట్లాడి ఒప్పించినట్లు చెప్పారు. త్వరలో ఆటోనగర్ పెద్దలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, వారి సలహాలు కూడా తీసుకుని, ఇక్కడ చెత్త పేరుకుపోకుండా, ఏరోజు చెత్త ఆ రోజు తరలించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.

## జగన్ పాలనలో ఏపీ విధ్వంసమైంది : ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

●ఎస్.ఐ.ఆర్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి

●జి.కొండూరులో ఘనంగా టీడీపీ మండల సమావేశం



మైలవరం (చైతన్యరథం): జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ సమావేశం బుధవారం జి.కొండూరులో వై జంక్షన్ వద్ద ఘనంగా జరిగింది. మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ నాయకత్వంలో కోటికిపైగా సభ్యత్వాలతో తెలుగుదేశంపార్టీ దేశంలోనే బలమైన ప్రాంతీయ పార్టీగా నిలిచిందని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం రేయింబవళ్లు కష్టపడుతున్నారని, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతోందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ పూర్తిగా విధ్వంసమైందని, అతని నిర్ణయాల వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని తీవ్రంగా ధ్వజమెత్తారు. సాంప్రదాయ రాజకీయాలకు జగన్ తెరదించారని, రాజ్యాధికారం మారినప్పటికీ గత ప్రభుత్వాలు అమలు చేసిన మంచి నిర్ణయాలను కొత్త ప్రభుత్వాలు కొనసాగించడం ఆనవాయితీ అని గుర్తుచేశారు. కానీ దానికి విరుద్ధంగా జగన్ పనిచేసి ఏపీని తిరోగమనం పాలు చేశారని ఆరోపించారు. "ఏకైక మూర్ఖపు మహా చక్రవర్తి ఎవరైనా ఉన్నారంటే అతనే జగన్మోహన్ రెడ్డి" అని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా అమలు చేస్తున్నామని వివరించారు.

## ప్రధానమంత్రి స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కొలికపూడి

తిరువూరు (చైతన్యరథం): ప్రధానమంత్రి స్వనిధి పథకం విజయవంతంగా 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన PM SVANidhi పథకం ద్వారా వీధి వ్యాపారులకు సులభ రుణ సదుపాయాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందని తెలిపారు. చిన్న వ్యాపారులు ఆత్మనిర్భరంగా ఎదగడానికి ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. అలాగే కూలీ పని చేస్తే ఒక రోజు గడుస్తుందని, ఉద్యోగం చేస్తే ఒకనెల గడుస్తుందని, కానీ వ్యాపారం చేస్తే జీవితాంతం కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతో పాటు పిల్లల ఉన్నత విద్యకు, కుటుంబ ఆర్థికాభివృద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యాపార రంగంలోకి వచ్చి స్వయం ఉపాధిని పెంపొందించుకోవడం ద్వారా ఆర్థికంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న రుణాలను అనవసర ఖర్చులకు వినియోగించి ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేయడం కంటే, వాటిని ఆదాయాన్ని పెంచే వ్యాపారాల కోసం వినియోగించుకోవడం ఎంతో మంచిదని సూచించారు. చిన్న స్థాయిలో టీ షాపులు, టిఫిన్ సెంటర్లు, పాడి పరిశ్రమలు, కిరాణా దుకాణాలు వంటి స్వయం ఉపాధి అవకాశాలను ప్రారంభించి, వాటిని క్రమంగా అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.

## ఆధారాలు లేకుండా బురదజల్లితే సహించేది లేదు

●మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వ్యాఖ్యలపై డీసీసీబీ చైర్మన్ మక్కెన నిప్పులు

వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ప్రస్తుత కూటమి నాయకుల మధ్య రాజకీయ యుద్ధం ముదిరింది. బుధవారం బొల్లా బ్రహ్మనాయుడు వైసీపీ కార్యాలయంలో గంటపాటు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన ఆరోపణలను డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తీవ్రంగా ఖండించారు. వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మక్కెన మల్లికార్జునరావు... బొల్లా బ్రహ్మనాయుడిపై నిప్పులు చెరిగారు. ఆధారాలతో సహా ఆయన అక్రమాలను నడిరోడ్డుపై పెడుతూ ఘాటైన విమర్శలు చేశారు. విలేకరుల సమావేశంలో మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ, బ్రహ్మనాయుడు మీరు తెలంగాణలో 14 రోజుల పాటు జైల్లో ఎందుకు ఉండాల్సి వచ్చిందో ముందు వినుకొండ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీ మనవరాలి భర్త కామని నాగేశ్వరరావు పేరిట గండిపేటలో సర్వే నెంబర్ 18లో ఎకరం 20 సెంట్ల భూమికి సంబంధించి నకిలీ ఫేక్ జీవో సృష్టించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆ భూమిని మీ పార్ట్నర్, బంధువు అయిన బొల్లా రమేష్‌కు అమ్మడం, మీ అకౌంట్ నుండి రెండు కోట్ల రూపాయలు బదిలీ అవ్వడం నిజం కాదా అని నిలదీశారు. అక్కడ తప్పు చేసి జైలు శిక్ష అనుభవించి వచ్చి, ఆ ఉక్రోషాన్ని ఇక్కడ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నాపై వెళ్లగక్కితే చూస్తూ ఊరుకోమని, మేము బాధ్యతగల పదవుల్లో ఉన్నాం కాబట్టి మీలాగా అడ్డగోలుగా మాట్లాడమని హెచ్చరించారు.

# అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి

## శ్రేణులకు టీడీపీ ప్రజాప్రతినిధుల పిలుపు

ఒంగోలు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించ డంతోపాటు వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని టీడీపీ శ్రేణులకు ఆ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. తెలు గుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం బుధవారం ఒంగోలులోని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.




# వైసీపీ నేతలపై కేసులు నమోదు

నెల్లూరు (చైతన్యరథం): జిల్లాలో వైసీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆనం విజయకుమార్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి సహా 17 మంది ఎమ్మెల్సీలు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. చిన్నబజారు పోలీసుస్టేషన్, బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ కేసులు నమోదు చేశారు. ఇటీవల జిల్లాలోని పలు విద్యాసంస్థలతో పాటు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి చెందిన కృష్ణచైతన్య విద్యాసంస్థల్లో విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తనిఖీలపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి స్పందించి.. మంత్రి నారాయణ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో వీఆర్సీ సెంటర్, చిల్డ్రన్స్ పార్క్ సెంటర్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఆందోళనలు నిర్వహించారని పోలీసులు పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం ద్వారా ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించారని తెలిపారు. అనుమతి లేకుండా నిరసనలు చేపట్టడం, ప్రజారవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించడం, జనజీవనాన్ని ప్రభావితం చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.



# సంక్షేమాభివృద్ధి సాధించాం!

## తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ పనబాక లక్ష్మి

తిరుపతి (చైతన్యరథం): తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సర్వేపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన "2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ పనబాక లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పనబాక లక్ష్మి మాట్లాడుతూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.రాష్ట్ర పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి, రైతులు, మహిళలు, యువత పేదల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

# ములుమూడి కలుజు బ్రిడ్జి ప్రారంభానికి సిద్ధం

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి వెల్లడి



నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని ములుమూడి కలుజు బ్రిడ్జిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ములుమూడి కలుజు మీద శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణం జరిగిందన్నారు. గత 30 ఏళ్లుగా ములుముడి కలుజు మీద బ్రిడ్జి సమస్యకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిష్కారం చూపించగలిగామన్నారు. ఈ నెల 28వ తేదీన ఉదయం 9:30 గంటలకు 83.20 లక్షల రూపాయలతో నిర్మించిన ములుమూడి కలుజు పై బ్రిడ్జిని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయ్ కుమార్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మొహిద్దీన్, మాజీ సర్పంచ్ కుందా కరుణాకర్, టీడీపీ నాయకులు పులి రాంగోపాల్, అట్ల నరసయ్య, మురళి రెడ్డి, సోడం భాస్కర్, దబ్బుగుంట కిష్టయ్య, పవన్ , అంజయ్య, దొడ్ల రామయ్య, జాను, మీర్జా, యాసిన్, సిపిఎం నాయకులు అట్ల అంజయ్య, మస్తాన్, గౌరబత్తిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలతో రైతులకు సిరిసంపదలు

## చందలూరులో మొక్కలు నాటిన టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి (చైతన్యరథం): దర్శి మండలం, చందలూరు గ్రామంలో గురువారం పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన ఈ పండ్ల తోటల పెంపకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో దర్శి టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ "ఉద్యాన పంటలే రైతన్నకు ఆదాయ వనరులని, సంప్రదాయ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటల ద్వారా రైతుకు అధిక ఆదాయం, దీర్ఘకాలిక భరోసా లభిస్తుంది. నీటి వినియోగం తక్కువ, లాభం ఎక్కువ" అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రంగానికి పెద్దపీట వేస్తోందని ఆమె వెల్లడించారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును విస్తృతం చేసేందుకు రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు, సాంకేతిక సహకారం అందిస్తోందన్నారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు ఉపాధితో పాటు రైతులకు ఆస్తులు సృష్టిస్తున్నామన్నారు. పండ్ల తోటల పెంపకం పర్యావరణ పరిరక్షణకు, భూగర్భ జలాల పెంపునకు దోహదపడుతుందని లక్ష్మీ వివరించారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సపోటా వంటి పండ్ల తోటలతో రైతులు ఆర్థికంగా బలపడతారని. ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం వస్తుందని అన్నారు. ప్రతి రైతు ఉద్యాన పంటల వైపు అడుగులు వేయాలని డాక్టర్ లక్ష్మీ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని చందలూరు గ్రామాన్ని ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీఓ, ఉద్యాన శాఖ అధికారులు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపు శెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు మారెళ్ళ వెంకటేశ్వర్లు, చందలూరు గ్రామంలోని స్థానిక టీడీపీ నాయకులు, రైతులు, మహిళలు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సేవాతత్పరుడు సుగవాసి

## అంబులెన్స్ వాహనాలను ప్రారంభించిన టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు



రాయచోటి (చైతన్యరథం): పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో మాసాపేట నారాయణ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో, మాజీ ఎంపీ స్వర్గీయ సుగవాసి పాలకొండరాయుడు ఫోటో ముద్రించిన రెండు అంబులెన్సులను ఎస్పీఎస్ సేవా సర్వీస్ పేరుతో పేద ప్రజల అవసరార్థం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి, టెంకాయ కొట్టి అంబులెన్సుల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వర్గీయ సుగవాసి పాలకొండరాయుడు ప్రజా సేవకు ప్రతీకగా నిలిచారని, వారి ఆశయాలను కొనసాగిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా అంబులెన్స్ సేవలను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పేద ప్రజలకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సమాజ సేవలో ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుగవాసి కుటుంబ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

చైతన్యరథం

# జోన్-5

(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)



కర్ణాటకలోని హొసపేట సమీపంలోని తుంగభద్ర డ్యామ్ నూతన గేట్లు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు స్వాగతం పలకడానికి హెలిప్యాడ్ వద్ద వేచి ఉన్న హిందూపురం పార్లమెంటు సభ్యుడు బీకే పార్ధసారధి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధులు

## కేంద్రమంత్రి గడ్కరీని కలిసిన ఎమ్మెల్యే కాకర్ల

### కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధిపై చర్చ

ఉదయగిరి (చైతన్యరథం): న్యూఢిల్లీలోని కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని వారి అధికారిక నివాసంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి అత్యంత అవసరమని కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వివరించారు. ప్రస్తుతం అనేక గ్రామాల ప్రజలు జాతీయ రహదారులను చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనెక్టివిటీ రోడ్లు అభివృద్ధి చెందితే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు, విద్య, వైద్య సేవలకు చేరువ కావడం మరింత సౌకర్యవంతంగా మారుతుందన్నారు. నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



## సీఎం చంద్రబాబు చొరవతో
## వైసీపీ చీకటిని చెండాడిన వెలుగొండ



వెలిగొండ (చైతన్యరథం): నిర్వాసితుల అనుమానాలు, ఆంధోళనలకు కూటమి ప్రభుత్వం తెరదించింది. రూ.905.56 కోట్ల పరిహారం మంజూరు చేసింది. ఈనెల 27న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా కొందరికి అందజేయనుంది. ఆతర్వాత మిగిలిన వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. అందుకు సంబంధించి ఆయా కుటుంబాల వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తొలి విడతగా రూ.300 కోట్లు తక్షణమే నిర్వాసితులకు అందించేందుకు చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. గత వైసీపీ పాలకులు వెలిగొండను మేమే పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికారు. చివరకు 2024 ఎన్నికల నాటికి పూర్తికాని ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేసి ఈ ప్రాంత ప్రజలను మోసగించారు. జగన్‌రెడ్డి నమ్మకద్రోహం చేశారన్న విషయాన్ని అందరూ తెలుసుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమికి అండగా నిలిచి అధికారం కట్టబెట్టారు. ఈ రెండేళ్లలో సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను స్పీడుగా చేయిస్తున్నారు. కొల్లంవాగు నుంచి మరికొద్ది నెలల్లోనే నీరు నల్లమల సాగర్ రిజర్వాయర్లలో నింపే చర్యలను వేగవంతం చేశారు. ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టాల్సిన ఫీడర్ కాలువ పనులకు అవసరమైన రూ.456 కోట్లు మంజూరు చేసి ఆ పనులను స్వయంగా సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఇదంతా చూసిన ప్రజలకు ప్రాజెక్ట్ పూర్తవుతుందనే నమ్మకం కలిగింది. ఇంతలోనే మళ్లీ నిర్వాసితుల అంశం తెరపైకి వచ్చింది. ప్రాజెక్టు పనులు పూర్తయితే తమ పరిస్థితి ఏమిటన్న గుబులు వారిలో మొదలైంది. కానీ కొద్దిరోజులకే కీలకమైన ఆ అంశానికి ప్రభుత్వం ముగింపునిచ్చింది. నిర్వాసితుల కోసం రూ.905.56 కోట్లు మంజూరు చేసింది. వెంటనే వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈనెల 27న సీఎం చంద్రబాబు దోర్నాల మండలం గంటవానిపల్లి వద్దకు వస్తున్నారు. వెలిగొండ పనుల పురోగతి తెలుసుకోవడంతోపాటు ఫీడర్ కాలువ పనులను ఆయన పరిశీలిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడతారు. తరువాత నిర్వాసితులకు పరిహారం విడుదల చేసి, కొందరికి తన చేతుల మీదుగా అందజేస్తారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన రిజర్వాయర్ల కోసం కాకర్ల, సుంకేసుల, గొట్టిపడియ వద్ద ఉన్న గ్యాప్‌లను పూడ్చి డ్యాంల నిర్మాణం పూర్తి చేశారు. వీటి పరిధిలో మొత్తం 11 గ్రామాలు, దాదాపు 7,270 నిర్వాసిత కుటుంబాలున్నాయి. సుంకేసులలో 2,901, కలనూతలలో 1,118, చింతలముడిపిలో 88, గుండంచర్లలో 1,201, కాటంరాజుతాండాలో 38, అక్కచెరువులో 158, గొట్టిపడియలో 1,420, సాయిరాంనగర్‌లో 26, రామలింగేశ్వరపురంలో 36, కృష్ణానగర్‌లో 78, లక్ష్మీపురంలో 206 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం అందనుంది. ఇవికాకుండా పరిహారం జాబితాలో పేర్లు లేవంటూ కొందరు దరఖాస్తు చేసుకుంటున్నారు. వాటిని కూడా అధికారులు పరిశీలించనున్నారు.

## గుంతకల్లు మీదుగా కొత్తగా వీక్లీ రైలు

ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి జల్నా-యల్హాంక-జల్నా మధ్య (వయా గుంతకల్లు) నెల రోజులపాటు వీక్లీ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జల్నా, యల్హాంక ప్రత్యేక వీక్లీ రైలు (07601)ను ఈ నెల 28 నుంచి జూలై 26 వరకూ ఆదివారాలలో ఐదు ట్రిప్పులు నడపనున్నారు. ఈ రైలు జల్నాలో సాయంత్రం 7-20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి తొమ్మిదిన్నరకు యల్హాంకకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాదగిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, బొల్లారం, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, పర్భని, సేలు, పర్తూర్ మీదుగా జల్నాకు చేరుకుంటుందన్నారు.




## అంతులేని అరాచకాలే వైసీపీని ఓడించాయి

### కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి



జమ్మలమడుగు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వ సుపరిపాలన రెండేళ్లు పరిపాలన విజయోత్సవ సభ దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఆ సభలో ఏ విధంగా అభివృద్ధి చేసామో ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. వైసీపీ వారు చేసిన ఆరాచకాలతో ప్రజలు విసిగిపోయి కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వాడించారన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి రంగాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచితబస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, వంటి సంక్షేమ పధకాలు అందించామన్నారు. మొన్న మీడియా సమావేశంలో వైకాపా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడిన మాటలు హాస్యాస్పదమన్నారు. మీ నాయకుడు రప్పా రప్పా అంటే ఖండించరా అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గంలో అన్ని మీరే చెసింటే ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి రాజకీయాల్లోకి వచ్చాక ఎం అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు. రామ సుబ్బారెడ్డికి నీతి, నిబద్దత లేదన్నారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో జమ్మలమడుగు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకోవాలని తెలిపారు. ఎవరి మెప్పు కోసం ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. 1994 లో గుండ్లకుంటలో 6 వేల ఓట్లు వున్నాయి. 24 వచ్చేసరికి 1000 ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. 1999లో మీరు గెలిచింది బోగస్ ఓట్లతో అన్నారు. చెప్పింది రామసుబ్బారెడ్డి రప్పా రప్పా మాటలకూ కౌంటర్‌గా ఆపరేషన్ సింధూర్ అని తిప్పికొట్టారు. సంక్షేమం ఒకవైపు అభివృద్ధి ఒకవైపు చేస్తుంటే మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి గురప్ప, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లికార్జున, రామాంజనేయులు రెడ్డి, పాల్గొన్నారు.







# 'తానా' ఆధ్వర్యంలో నాన్నతో నడక

పెన్సిల్వేనియాలో 40వ మెగా ఈవెంట్ విజయవంతం

మధుర క్షణాలను గుర్తు చేసుకున్న తెలుగు ప్రజలు

స్పెషల్ అట్రాక్షన్‌గా ప్రముఖ సినీ నటుడు సుమన్

**పెన్సిల్వేనియా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో మరో మధురమైన కార్యక్రమం నాన్నతో నడక. ఫాదర్స్ డేను పురస్కరించుకుని తానా మిడ్ అట్లాంటిక్ సంఘం 40వ వేడుకను పెన్సిల్వేనియాలోని వ్యాలీఫోర్డ్ నేషనల్ హిస్టారికల్ పార్క్‌లో నిర్వహించింది. 2025 జూలై నుంచి వరుసగా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. నాన్నతో నడక పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరికీ నాన్నతో తాము గడిపిన మధురక్షణాలను గుర్తుకు తెచ్చేలా సాగింది. తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, తానా బోర్డ్ డైరెక్టర్ రవి పొట్లూరి, తానా మిడ్-అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్ ఫణి కంతేటితో పాటు ఈ కార్యక్రమానికి సూచనలు, మార్గదర్శకత్వం చేసిన తానా బెనిఫిట్ కో-ఆర్డినేటర్ వెంకట్ సింగు కూడా పాల్గొన్నారు. మరో ముఖ్య ఆకర్షణగా ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్ నిలిచారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేయడంతో ఈ వేడుక మరింత ప్రత్యేకంగా, చిరస్మరణీయంగా నిలిచింది. ప్రతి ఒక్కరి జీవితంలో నాన్న ఎలాంటి కీలకమైన పాత్ర పోషించే వారో సుమన్ తన మాటల్లో తెలియజేశారు. స్ఫూర్తిదాయకమైన ఆయన ప్రసంగం ఎంతగానో ఆకట్టుకుంది. తండ్రులు, పిల్లలతో కలిసి ఫొటోలు దిగటం అందరినీ ఆకర్షించింది. మిమిక్రీ రమేష్ తన పాటలు, ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమానికి మరింత ప్రేరణను, అర్థాన్ని చేకూర్చేలా మఖ్దూమ్ సయ్యద్, ఉమాకాంత్ స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు కూడా వేడుకకు ప్లస్ పాయింట్లుగా నిలిచాయి. దాదాపు 200 మందికి పైగా తండ్రులు, వారి పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమ విజయవంతానికి ఎంతో కృషి చేసిన సురేష్ యలమంచికి నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విలువైన సహకారం అందించిన సునీల్ కోగంటి, రంజిత్ మామిడి, శ్రీధర్ సాదినేని, దీప్తి కోక, సంతోష్ రౌతు, చలం పావులూరి, కృష్ణ నందమూరి, విశ్వనాథ్ కోగంటి, ప్రసాద్ కస్తూరిలకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈవెంట్ కోసం అంకితభావంతో పనిచేసిన వాలంటీర్లందరికీ 'వాలంటీర్ సర్వీస్ అవార్డ్ సర్టిఫికెట్లు' ప్రదానం చేశారు. విచ్చేసిన వారందరికీ మధ్యాహ్న భోజన వసతి కల్పించి ఈ వేడుకను అందరికీ ఒక మధురమైన అనుభూతిగా మార్చారు.







# 'తానా' విద్యా సేవ

## తెనుగుపూడి జడ్పీ హైస్కూలు విద్యార్థులకు హోంవర్క్ డైరీల పంపిణీ

**దేవరాపల్లి (చైతన్యరథం):** విద్యార్థుల్లో క్రమశిక్షణ, చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మరో ముందడుగు వేసింది. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తెనుగుపూడి ప్రభుత్వ జడ్పీ హైస్కూల్లో SATVIINSPIRE ఫౌండేషన్, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు హోంవర్క్ డైరీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీచరణి మేకా స్పాన్సర్ చేయగా తానా ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ చౌదరి మేకా ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. దాతలకు ప్రధానోపాధ్యాయుడు డి.ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, కొండమ్మ, త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, తానా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ నల్లూరి, తానా బోర్డు చైర్మన్ డాక్టర్ నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి, తానా న్యూజెర్సీ బృందం మార్గదర్శకత్వం, సహకారం అందించారు. ఈ సందర్భంగా SATVIINSPIRE ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు భవిష్యత్తులో కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.



# ఆగస్టులో టీసీఏ స్వర్ణోత్సవాలు

## భారత కాన్సుల్ జనరల్‌కు ఆహ్వానం



**హ్యూస్టన్, టెక్సాస్:** తెలుగు సాంస్కృతిక సమితి (TCA) కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు కె.యాదగిరిరెడ్డి, చార్టీచౌదరి... టెక్సాస్‌లోని భారత కాన్సుల్ జనరల్ డీసీ మంజునాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 7, 8 తేదీల్లో జరిగే TCA స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, తెలుగు సమాజ ఐక్యత, యువతలో తెలుగు భాషాభిమానాన్ని పెంపొందించే అంశాలపై చర్చించారు. తెలుగు వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, తెలుగు సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే చారిత్రాత్మక వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు టీసీఏ ఏర్పాట్లు చేస్తోంది.

# బే ఏరియాలో 'రాక్ స్టార్' దేవిశ్రీ ప్రసాద్

## శాన్‌హోసేలో నేడు భారీ లైవ్ కాన్సర్ట్



**బే ఏరియా (అమెరికా):** ప్రముఖ సంగీత దర్శకుడు, రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ బే ఏరియాకు వచ్చారు. తన ఆట, పాట, సంగీతంతో అందరినీ తన్మయులను చేసేందుకు వచ్చిన ఆయనకు 'బాటా' నాయకులు వీరు ఉప్పల, ప్రసాద్ మంగిన, కరుణ్ వెలిగేటి, ఇతర నాయకులు ఘన స్వాగతం పలికారు. బే ఏరియా తెలుగు అసోసియేషన్ (BATA), బే ఏరియా ఎంటర్‌టైన్‌మెంట్స్, నాగరాజ్ అన్నయ్య సంయుక్తంగా అపెక్స్ కన్సల్టింగ్ సర్వీసెస్ అసోసియేషన్‌తో కలిసి శాన్‌హోసే సివిక్ వేదికగా శుక్రవారం భారీ లైవ్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నాయి. "బ్యాక్ ఇన్ ది బే" పేరిట జరుగుతున్న ఈ మ్యూజికల్ ఈవెంట్ కోసం సంగీతప్రియులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ సంగీత విభావరిలో డీఎస్పీతో పాటు టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ సింగర్లు సందడి చేయనున్నారు. సాగర్, సమీరా భరద్వాజ్, రీటా, కార్తీక్ తమ అద్భుతమైన గానంతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు. టికెట్ల కొనుగోలుకు www.bata.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. మరింత సమాచారం కోసం 510-421-3535, 650-776-1203 నెంబర్లకు ఫోను చేయాలి.



# భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడులు

## 13 బిలియన్ డాలర్ల మేరకు ప్రణాళిక : సీఈఓ ఆండీ జెస్సీ తాజా ప్రకటన



భారత్‌లో 2030 నాటికల్లా మరో 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్టు అమెజాన్ సీఈఓ ఆండీ జెస్సీ తాజాగా ప్రకటించారు. ప్రధాని మోదీతో సమావేశం అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. 2026–30 మధ్య కాలంలో భారత్‌లో 36 బిలియన్ డాలర్ల పెట్టుబడికి ప్లాన్ చేసినట్టు అమెరిజాన్ గతేడాదే ప్రకటించింది. ఇందుకు అదనంగా మరో 13 బిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్టు సీఈఓ ఆండీ జెస్సీ ఎక్స్ వేదికగా తెలిపారు. ప్రధాని మోదీతో సమావేశంపై సీఈఓ ఆండీ జెస్సీ హర్షం వ్యక్తం చేశారు. భారత్‌లో అమెజాన్ ప్రణాళికను ప్రధానితో పంచుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే కొన్నేళ్లు భారత్‌లోని వివిధ రంగాల్లో వ్యాపారస్తులకు తాము సేవలందిస్తున్నామని అన్నారు. అయితే, ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో మొత్తం 48 బిలియన్ డాలర్లను భారత్‌లో పెట్టుబడి పెట్టనున్నట్టు చెప్పారు. ఇందులో ఏఐ, క్లౌడ్ మౌలిక వసతుల రూపకల్పనకు 21 బిలియన్ డాలర్లకు పైగా కేటాయిస్తామని అన్నారు. భారత్‌లో 2030 కల్లా 3.8 మిలియన్ల ఉద్యోగాల సృష్టి, 80 బిలియన్ డాలర్ల ఈకామర్స్ ఎగుమతులు, చిన్న వ్యాపారాలకు, ప్రభుత్వ స్కూళ్లకే ఏఐ ప్రయోజనాలు అందించేలా ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు. ప్రధానితో సమావేశం సందర్భంగా అమెజాన్ గ్లోబల్ వ్యాపార కార్యకలాపాల్లో భారత్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యత గురించి వివరించారు. భారత్‌లో డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటుకు, అభివృద్ధికి అమెజాన్ కట్టుబడి ఉందని కూడా అన్నారు.

# వెనెజువెలాలో భూకంపాల బీభత్సం



## 164కు చేరినమృతుల సంఖ్య

వెనెజువెలా రాజధాని కరాకస్‌తో పాటు పరిసర ప్రాంతాలలో బుధవారం సాయంత్రం వరుసగా రెండు సార్లు భూకంపాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఒక నిమిషం తేడాతో 7.2.. 7.5 మాగ్నిట్యూడ్‌తో భూకంపాలు వచ్చాయి. దీంతో పలు భవనాలు దెబ్బతినగా, మరి కొన్ని పూర్తిగా కూలిపోయాయి. ఈ ఘటనలో మృతుల సంఖ్య గురువారం మధ్యాహ్నం నాటికి 164కి చేరింది. బుధవారం రాత్రి వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ.. భూప్రకంపనల కారణంగా కారణంగా 32 మంది చనిపోయినట్లు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకుని స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించారు. ఈ రోజు (గురువారం) మరోసారి డెల్సీ రోడ్రిగ్జ్ భూకంపాలపై ప్రకటన చేశారు. మృతుల సంఖ్య 164కు చేరిందని తెలిపారు. 971 మంది గాయపడినట్లు వెల్లడించారు. లా గువైరాలో 700 మంది గాయపడినట్లు ఆమె తెలిపారు. అక్కడ డజన్ల కొద్దీ బిల్డింగ్‌లు నేలమట్టం అయినట్లు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు.

## నోరు జారడం క్షమాపణలు చెప్పడం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అలవాటే : బీజేపీ ఐటీసెల్

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ చౌహాన్ తనపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ స్పందించారు. కార్తికేయపై చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తున్నానంటూ మధ్యప్రదేశ్ హైకోర్టులో మరో అప్లికేషన్ దాఖలు చేశారు. తన వ్యాఖ్యలు కార్తికేయను ఉద్దేశించినవి కావని తెలిపారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ప్రమోద్ కుమార్ అగర్వాల్ విచారణ చేపట్టనున్నారు. 2018లో జాభువాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాహుల్ గాంధీ పనామా పేపర్ లీక్స్ అంశాన్ని ప్రస్తావించారు. ఆ సందర్భంగా రాహుల్ గాంధీ కార్తికేయ సింగ్ ప్రస్తావన కూడా తేవడంతో ఆయన భోపాల్‌లో ఎమ్మెల్యే, ఎంపీ స్పెషల్ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల వల్ల తన పరువు దెబ్బతిందని ఆరోపించారు. దీంతో, విచారణకు హాజరు కావాలంటూ ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. అయితే, రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లతో పాటు తనపై దాఖలైన పరువు నష్టం కేసును కొట్టేయాలని అభ్యర్థించారు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తూ తాజాగా మరో అప్లికేషన్ దాఖలు చేశారు. దీనిపై బీజేపీ ఐటీ సెల్ విమర్శలు గుప్పించింది. రాహుల్ గాంధీ ఇప్పటికి ఎన్నో సార్లు ఇలాంటి క్షమాపణలు చెప్పారని కామెంట్ చేసింది.



గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో

# పెరుగుతున్న మృతుల సంఖ్య

## మంత్రులతో కలిసి ఘటన స్థలానికి సీఎం సువేందు అధికారి


కోల్‌కతా నగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తొలుత ఐదుగురు కార్మికులు మరణించారు. ఆ సంఖ్య బుధవారం ఎనిమిదికి చేరింది.

# కన్నడనటి ఇంటిలో వ్యాపారి ఆత్మహత్య

డిప్రెషన్‌తో బాధపడుతున్న ఓ వ్యాపారి నటి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైశాఖ్ అనే వ్యాపారవేత్త గత కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్నాడు. భార్యతో గొడవల కారణంగా ఇంటికి కూడా దూరంగా ఉంటున్నాడు. వారం రోజుల నుంచి బెంగళూరు, రాజరాజేశ్వరి నగర్‌లోని నటి క్రిషి తపండ ఇంట్లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో క్రిషి ఇంట్లో లేదు.ఆమె యలహంకకి వెళ్లింది. ఆత్మహత్య సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సంఘటనా స్థలంలో ఎటువంటి సూసైడ్ నోట్ లభించలేదు. డిప్రెషన్‌తో బాధపడుతున్న వైశాఖ్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వ్యక్తిగత, కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడని వెల్లడైంది. కుటుంబసభ్యులు వైశాఖ్ మరణంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు. రాజరాజేశ్వరి నగర్ పోలీసులు కేసు నమోదు చేయనున్నారు. ఫార్మాలిటీస్ పూర్తయిన తర్వాత వైశాఖ్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. కాగా, ప్రముఖ వ్యాపారవేత్త అరవింద్ రెడ్డిని బెదిరించిన కేసులో వైశాఖ్‌ను గతంలో పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు 5 రోజుల పాటు అతడిని విచారించారు. అయితే, ఫిబ్రవరి 6వ తేదీన కర్ణాటక హైకోర్టు వైశాఖ్ కేసు విచారణపై స్టే విధించింది.







# అగమ్యగోచరంగా అఘాడీ భవిష్యత్తు!

మహారాష్ట్ర రాజకీయాల్లో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) భవిష్యత్తుపై మరోసారి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష కూటమి బుధవారం నాడు నిర్వహించిన వ్యూహాత్మక సమావేశానికి 60 మంది ఎమ్మెల్యేల్లో ఏకంగా 23 మంది గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సీనియర్ నేత జయంత్ పాటిల్ హాజరుకాకపోవడం కూటమిలోని అంతర్గత విభేదాలపై ఊహాగానాలకు బలం చేకూర్చింది. కాంగ్రెస్‌కు చెందిన నానా పటోలే, విజయ్ వడెట్టివార్ కూడా సమావేశానికి రాలేదు. అయితే, వడెట్టివార్ అనారోగ్య కారణాలతో గైర్హాజరైనట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. కాగా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్, శివసేన (ఉద్ధవ్ వర్గం) నేత సంజయ్ రౌత్ సమావేశంలో పాల్గొన్నారు. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన వర్గానికి ఇటీవల మరో భారీ ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరడంతో ఎంవీఏలో అసంతృప్తి మంటలు మరింత రాజుకున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రే నిన్న జరిగిన సమావేశంలో భావోద్వేగానికి లోనయ్యారు. 'మనం నిజంగానే కలిసి ఉన్నామా?' అని కూటమి నేతలను ఆయన ప్రశ్నించారు. 'మనం కలిసి ఉన్నామని చెబుతున్నాం. కానీ నిజంగా కలిసి ఉన్నామా?, అసెంబ్లీలో ఒకే స్వరంతో మాట్లాడుతున్నామా?, ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడుతున్నామా?' అని ప్రశ్నించారు. మరోవైపు పార్టీని వీడిన నేతల గురించి స్పందిస్తూ 'మనతో ఉన్నవారిపై దృష్టి పెట్టాలి. వెళ్లిపోయే వాళ్లని వెళ్లిపోనివ్వండి' అని ఉద్ధవ్ వ్యాఖ్యానించారు.అదే సమయంలో మహారాష్ట్రలో ఎంవీఏ ఇప్పటికీ కీలక రాజకీయ శక్తే అని ఉద్ధవ్ తేల్చి చెప్పారు. కూటమి భాగస్వామ్య పార్టీలు సంయుక్త సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి మన ఐక్యతను ప్రజలకు మరింత బలంగా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆరుగురు ఎంపీల తిరుగుబాటు అంశం చర్చకు రాలేదని సమాచారం. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధానంగా చర్చ జరిగింది. అయితే రాజకీయ విశ్లేషకులు మాత్రం ఎంవీఏ భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. 2022లో ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటుతో శివసేన చీలిపోగా.. 2023లో ఎన్సీపీలోనూ ఇలాంటి పరిణామాలే చోటుచేసుకున్నాయి. ఇప్పుడు మరోసారి శివసేనలో ఎంపీల వలసలు కూటమికి కొత్త తలనొప్పిగా మారాయి. 2019లో ఏర్పడిన ఎంవీఏ కూటమి మొదటి నుంచే సిద్ధాంతపరమైన విభేదాలతో విమర్శలు ఎదుర్కొంది. కాంగ్రెస్, ఎన్సీపీ వంటి లౌకికవాద పార్టీలతో హిందుత్వ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లిన శివసేన చేతులు కలపడం అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసింది.

బీజేపీని అధికారానికి దూరంగా ఉంచడమే ఈ కూటమి ప్రధాన లక్ష్యమన్న విమర్శలూ వచ్చాయి. అయితే నాలుగేళ్లుగా ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంటూ వచ్చిన ఎంవీఏ ఇప్పుడు మరికొన్ని కీలక పరిణామాలను ఎదుర్కొంటోంది. వరుస తిరుగుబాట్లు, నేతల అసంతృప్తి, సమావేశాలకు గైర్హాజరు అవుతున్న కీలక నాయకులు వంటి అంశాలు చూస్తే మహా వికాస్ అఘాడి బండి పట్టాలు తప్పే ప్రమాదం ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# వెనెజువెలాలో విలయం

- వణికించిన భారీ భూకంపాలు
- 164 మంది మృతి
- 'లా గువైరా' తీర ప్రాంతం అతలాకుతలం



వెనెజువెలా దేశాన్ని వరుస భారీ భూకంపాలు వణికించాయి. ఈ ప్రకృతి విపత్తు సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. భూకంప ధాటికి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ముఖ్యంగా తీర ప్రాంత నగరమైన 'లా గువైరా' ప్రస్తుతం మరుభూమిని తలపిస్తోంది. అక్కడ ఎటు చూసినా కూలిపోయిన భవనాల శిథిలాలే కనిపిస్తున్నాయి. ఈ నగరంలోని ఒక ప్రముఖ హోటల్ భారీ విపత్తు ధాటికి పూర్తిగా దెబ్బతిని కేవలం శిథిలాల కుప్పగా మారింది.

### 'హోటల్ ఎడెక్స్' పూర్తిగా ధ్వంసం

లా గువైరాలోని మకుటో ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందిన 'హోటల్ ఎడెక్స్' పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంటుంది. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే ఈ 10 అంతస్తుల భవనం ఎప్పుడూ వేడుకలు సమావేశాలతో కోలాహలంగా ఉండేది. అయితే తాజాగా సంభవించిన భూకంపం ధాటికి ఈ భవనం పేకమేడలా కూలిపోయింది. కేవలం హోటల్ బేస్‌మెంట్ మాత్రమే మిగిలి మిగతా భాగమంతా గుర్తుపట్టలేని విధంగా ధ్వంసమైంది. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. భూకంపం సమయంలో ఈ హోటల్లో ఎంతమంది ఉన్నారనేది ఇంకా తెలియరాలేదు. కాగా వెనెజువెలా బాక్సింగ్ స్టార్ కుటుంబ సభ్యులు ఈ హోటల్ శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం అందుతోంది.

### 'డిజాస్టర్ జోన్'గా ప్రకటన

కేవలం సృజనాత్మక హృదయంతో కూడిన నగరాలే కాకుండా వెనెజువెలా రాజధాని కారకాస్‌తోపాటు పలు నగరాలు ఈ భూకంపం ధాటికి ఛిన్నాభిన్నమైపోయాయి. ఇందులో అత్యధికంగా ప్రభావితమైంది 'లా గువైరా'అని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని ఆమె 'డిజాస్టర్ జోన్'గా ప్రకటించారు. ఇక్కడి పరిస్థితి అత్యంత విషాదకరమని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు దాదాపు 30సార్లు భూప్రకంపనలు సంభవించాయి.


### 164 మంది మృతి.. వేగంగా సహాయక చర్యలు

ఈవిపత్తు కారణంగా మరణించిన వారి సంఖ్య 164కు పెరిగింది. అలాగే 971మంది గాయపడినట్లు రోడ్రిగ్జ్ తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించి ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఈ విపత్తు సమయంలో వెనెజువెలాకు సహాయం అందించేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి.జర్మనీ సైనిక రవాణా విమానాలను పంపిస్తామని చెప్పగా, అత్యవసర సాయం చేస్తామని స్పెయిన్ ప్రకటించింది.

# భూకంపాన్ని ముందే గుర్తించిన గూగుల్

- వందలాది మందికి హెచ్చరికలు పంపి ప్రాణాలు కాపాడిన వైనం
- ఫోన్లలోని యాక్సిలరోమీటర్ సాయంతోనే ప్రకంపనల ముందస్తు గుర్తింపు



వెనెజువెలాలో సంభవించిన మహా విపత్తులో గూగుల్ ఆండ్రాయిడ్ సాంకేతికత కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. బుధవారం సాయంత్రం భూకంపం సంభవించడానికి కేవలం కొన్ని క్షణాల ముందే లక్షలాది మంది స్మార్ట్‌ఫోన్లకు గూగుల్ ముందస్తు హెచ్చరికలను పంపింది. ఈ అలర్ట్ మెసేజ్‌లు చూసి అప్రమత్తమైన వేలాది మంది ప్రజలు తక్షణం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిప్రాణాలు దక్కించుకున్నారు. ఆధునిక ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లలో యాక్సిలరోమీటర్ అనే ఒక చిన్న సెన్సార్ ఉంటుంది.సాధారణంగా మనం ఫోన్‌ను అడ్డంగా తిప్పినప్పుడు స్క్రీన్ ఆటోమేటిక్‌గా రొటేట్ అవ్వడానికి ఇది ఉపయోగపడుతుంది. అయితే ఈ సెన్సార్‌కు భూమిలో వచ్చే అతి సూక్ష్మమైన కంపనాలనుకూడా గుర్తించేసామర్థ్యం ఉంది. వెనెజెవెలాలో భూకంపతరంగాలు మొదలైనప్పుడు.. ఆ పరిధిలోని వేలాది ఫోన్లలోని యాక్సిలరోమీటర్లు ఆ వైబ్రేషన్లను రికార్డ్ చేసి శరవేగంగా గూగుల్ సర్వర్లకు సిగ్నల్స్ పంపాయి. ఒకే ప్రాంతంలోని వందలాది ఫోన్ల నుంచి ఒకే రకమైన సిగ్నల్స్ అందినవెంటనే.. గూగుల్ ప్రత్యేక అల్గారిథమ్ దానిని భూకంపంగా నిర్ధారించి క్షణాల వ్యవధిలో ఆ ప్రాంతంలోని మిగతా ఆండ్రాయిడ్ వినియోగదారులు అందరికీ అత్యవసర అలర్ట్ జారీ చేసింది.

### ప్రైమరీ వేవ్స్ ఆధారంగా ముందస్తు సమాచారం!

టెక్ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. భూకంపాలు ఎప్పుడూ ఒకేసారి పెద్ద కుదుపుతో రావు. అవి తరంగాల రూపంలో ప్రయాణిస్తాయి. మొదట వచ్చే ప్రైమరీ వేవ్స్ సెకనుకు 6 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. కానీ వీటివల్ల పెద్దగా నష్టం జరగదు. ఆ తర్వాత వచ్చే సెకండరీ వేవ్స్ సెకనుకు 3 నుంచి 4 కిలో మీటర్ల వేగంతో వస్తూ భారీ వినాశనాన్ని సృష్టిస్తాయి. ఆండ్రాయిడ్ ఫోన్లు అత్యంత సున్నితమైన 'ప్రైమరీ వేవ్స్' రాకను ముందే గుర్తించి గూగుల్ సర్వర్‌ను అలర్ట్ చేయడం వల్ల ప్రధాన వినాశకర తరంగాలు భూమిని తాకడానికి ముందే ప్రజలకు విలువైన సమయం దొరికింది.


### రెండు రకాల హెచ్చరికలు.. భారత్‌లోనూ అందుబాటులో!

భూకంప తీవ్రత ఆధారంగా ఆండ్రాయిడ్ వ్యవస్థ రెండు రకాల అలర్ట్‌లను ఇస్తుంది. భూకంప తీవ్రత తక్కువగా ఉన్నప్పుడు బి అవేర్ అలర్ట్ వస్తుంది. అయితే కేవలం సమాచారం కోసం దీనిని పంపుతుంది. తీవ్రమైన భూకంపాల సమయంలో ఫోన్ సైలెంట్‌లో ఉన్నా పెద్ద శబ్దంతో స్క్రీన్‌పై.. టేక్ యాక్షన్ అలర్ట్ హెచ్చరికలు చూపిస్తుంది. అలాగే సురక్షితంగా ఎలా బయటపడాలో సూచనలు ఇస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల ఫోన్లలో ఈ ఫీచర్ అందుబాటులో ఉందని గూగుల్ తెలిపింది. భారతదేశంలో కూడా 2023 నుంచి ఈ ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ లైవ్‌లోకి వచ్చింది. ఆండ్రాయిడ్ 5 అంతకంటే ఆధునిక వెర్షన్ ఉన్న ప్రతి ఫోన్లలోనూ ఈసేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ ముందస్తు హెచ్చరికలు రావాలంటే ఫోన్‌లో ఎల్లప్పుడూ మొబైల్ డేటా లేదా వైఫై ఆన్‌చేసి ఉండటం తప్పనిసరి. ఒకవేళ ఈ ఫీచర్ వద్దనుకునే వారు ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి అత్యవసర అలర్ట్స్‌ను ఆఫ్ చేసుకోవచ్చు.

# ఢిల్లీ నుంచి పోటీ చేస్తే 10లక్షల ఓట్ల మెజారిటీ ఖాయం!

### మెలోని కొత్త పుస్తకంలో భారత్ ముచ్చట్లు




ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనికి భారతదేశంపై ఉన్న ప్రత్యేక అభిమానం మరోసారి బహిర్గతమైంది. ఇరు దేశాల మధ్య రోజురోజుకూ బలపడుతున్న ద్వైపాక్షిక బంధానికి ఈ ప్రేమాభిమానాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ఇటలీ పర్యటనకు వెళ్లినప్పుడు.. మెలోనికి 'మెలోడీ' చాక్లెట్లను కానుకగా ఇవ్వడం,ఆదృశ్యాలు నెట్టింట వైరల్ కావడం తెలిసిందే. తాజాగా ఆమె రాసిన నూతన పుస్తకంలో భారత పర్యటనకు సంబంధించిన పలు ఆసక్తికరమైన స్మృతులను పంచుకుంటూ మన దేశంపై తనకున్న కృతజ్ఞతను చాటుకున్నారు.

మెలోని తన సరికొత్త పుస్తకం 'జార్జియా విజన్'లో తన భారత పర్యటన తాలూకు అనుభవాలను అక్షరబద్ధం చేశారు. ఢిల్లీలో తనకు లభించిన అపూర్వ స్వాగతం గురించి ప్రస్తావిస్తూ ఒక ఆసక్తి కరమైన సంఘటనను పంచుకున్నారు. ఆమె పర్య టించే మార్గంలో రోడ్లకు ఇరువైపులా భారీగా వెలసిన స్వాగత పోస్టర్లను చూసి ఆమెతోపాటు ఉన్న ఇటలీ ఉప ప్రధాని ఆంటోనియో తజాని ఒక సరదావ్యాఖ్యచేశారట."ఈ పోస్టర్లు, ఇక్కడ మీకున్న ఆదరణ చూస్తుంటే.. మీరు గనుక ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేస్తే కనీసం 10లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం ఖాయం!" అని తజాని చమత్కరించినట్టు మెలోని తన పుస్తకంలో పేర్కొన్నారు.

### 'థాంక్స్ టు భారత్'.. మెలోని భావోద్వేగం

భారత పర్యటనలోని ఆత్మీయతను గుర్తుచేసుకుంటూ మెలోని పుస్తకంలో ఇలా రాసుకొచ్చారు: "నేను ఢిల్లీలో అడుగుపెట్టగానే స్వాగత తోరణాలు, పోస్టర్లు దర్శనమిచ్చాయి. రోడ్డుపై వెళ్తున్న కొద్దీ ప్రతి అడుగులోనూ అవి కనిపించాయి... "మరో విశేషం ఏంటంటే.. అన్ని పోస్టర్లలోనూ ఒకే ఫొటోను ఉపయోగించారు. అది చూసి నాకు చాలా ఆనందంగా, ఆశ్చర్యంగా అనిపించింది. థాంక్స్ టు భారత్."

## భారత్-బంగ్లాదేశ్ మధ్య టూరిస్ట్ వీసా సేవలు ప్రారంభం

### రెండేళ్ల తర్వాత బంగ్లాదేశీయులకు అనుమతి



ఇటీవలి కాలంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు కాస్త బలపడుతున్నాయి. ఇరు దేశాల మధ్య ఇటీవలే దౌత్య సేవలు ప్రారంభమయ్యాయి. రాయబార కార్యాలయాలు రెండు దేశాల్లో పని చేస్తున్నాయి. ఈ అంశంలో తాజాగా మరో ముందడుగు పడింది. రెండుదేశాల మధ్య టూరిస్ట్ వీసా సేవలు ప్రారంభం కానున్నాయి. దాదాపు రెండేళ్ల తర్వాత ఈ సేవలు ప్రారంభమవుతుండటం విశేషం.ఈ విషయాన్ని బంగ్లాలో భారత రాయబారి దినేష్ త్రివేది వెల్లడించారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని వీసా జారీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ నెల 28 నుంచి టూరిస్ట్ వీసా సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీని ద్వారా బంగ్లాదేశ్ నుంచి ఇండియా రావాలనుకునే వారికి భారత పర్యాటక వీసాలు జారీ అవుతాయి. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న బంగ్లా పౌరులు ఇండియాలో వైద్యం చేయించుకోవాలి అనుకుంటే..మానవతా కోణంలో స్పందించి ఇండియాకు మెడికల్ వీసాలు కూడా జారీ చేస్తామని దినేష్ త్రివేది తెలిపారు. వీసాల జారీకి బంగ్లాలో ఐదు కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. అవి ఢాకా, రాజ్‌షాహి, ఛిట్టగాంగ్, సిల్హెట్, ఖుల్నా. కొంతకాలంగా ఇండియా, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. 2024లో అక్కడి ఇందిరాగాంధీ కల్చరల్ సెంటర్‌ను ధ్వంసంచేయడం నుంచి,భారత వీసాజారీ కేంద్రాలపై దాడులు వంటి కారణాలతో 2024నుంచి వీసాల జారీనిలిచిపోయింది. అప్పటి బంగ్లాపాలకుడు యూనస్ అనుసరించిన వైఖరి కూడా ఇందుకు కారణం.

ఇదే సమయంలో అక్కడ హిందువులపై దాడులు, బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయమివ్వడం వంటివి రెండుదేశాల మధ్య దూరాన్ని మరింత పెంచాయి. అయితే, ఇటీవల బంగ్లాలో జరిగిన ఎన్నికల్లో విజయంఅనంతరం గత ఫిబ్రవరిలో తారిఖ్ రెహమాన్ ప్రధానిగా బాధ్యతలుచేపట్టాక ఇరుదేశాల మధ్యసంబంధాలు నెమ్మదిగా బలపడుతున్నాయి. దీనిలో భాగంగా రెండు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు మెరుగయ్యాయి. తాజాగా వీసా జారీని కూడా ఇండియా ప్రారంభించింది.

## మెక్సికో అడవుల్లో 'మాయా' నగరం

### వెయ్యేళ్ల తర్వాత వెలుగు చూసిన వైనం

మెక్సికో సిటీ చారిత్రక పరిశోధనల్లో సరికొత్త అధ్యాయం లిఖిస్తూ.. దక్షిణ మెక్సికోలోని దట్టమైన అడవుల లోపల వెయ్యి సంవత్సరాలకు పైగా ఎవరి కంటికీ పడకుండా దాగున్న ఒక ప్రాచీన 'మాయా' నగరం వెలుగుచూసింది. ఇటీవలి కాలంలో జరిగిన అత్యంత కీలకమైన పురాతన ఆవిష్కరణల్లో ఒకటిగా నిపుణులు దీనిని అభివర్ణిస్తున్నారు. మెక్సికోలోని కాంపెచే రాష్ట్రంలో ఉన్న 'కలాక్‌ముల్ బయోస్పియర్ రిజర్వ్' అనే మారుమూల అటవీ ప్రాంతంలో ఈ నగరాన్ని కనుగొన్నారు. దీనికి 'మినాన్‌బే' అని పేరు పెట్టారు. యుకాటెక్ మాయా భాషలో దీనికి 'దారి లేని చోటు' అని అర్థం. ఈ నగరానికి చేరుకోవడానికి పరిశోధక బృందం ఎంతటి కఠినమైన సవాలును ఎదుర్కొందో ఈ పేరే తెలియజేస్తోంది.

మెక్సికో, స్లోవేనియా దేశాలకు చెందిన ఉమ్మడి పరిశోధక బృందం ఈ అద్భుత నగరాన్ని కనుగొంది. స్లోవేనియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ ఆర్ట్స్ పరిశోధనాకేంద్రానికి చెందిన ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త ఇవాన్ స్రాజ్క్ నాయకత్వంలో, సెంట్రల్ మాయా లోలాండ్స్‌లో గత మూడు దశాబ్దాలుగా సాగుతున్న పరిశోధనలకు ఈ ఆవిష్కరణ ఓమకుటా యమానంగా నిలిచింది. మెక్సికో జాతీయ మానవశాస్త్ర, చరిత్ర సంస్థ అనుమతితో ఈ యాత్రను చేపట్టారు. పరిశోధకులు దట్టమైన అడవులను నరుక్కుంటూ ఆల్-టెర్రైన్ వాహనాలు, కాలినడకన తీవ్రమైన ఉష్ణమండల వాతావరణాన్ని తట్టుకుంటూ ఈ ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ వారికిలభించిన నిర్మాణాలు అబ్బురపరిచాయి. ఓ నాలుగు అంతస్తుల భవనంఎత్తుతో..దాదాపు 43అడుగుల ఎత్తైన పిరమిడ్ దేవాలయం ఇక్కడ కనిపించింది. ఇది 7 నుంచి 12వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ 'రియో బెక్' నిర్మాణ శైలిని పోలి ఉంది. ఇక్కడ 14 బలిపీఠాలు, రాతి స్తూపాలు బయటపడ్డాయి.




## జ్యోతికి ఆసియాడ్ బెర్త్

*మోకాలి గాయం కారణంగా కొన్నాళ్లుగా ట్రాక్‌కు దూరమైన తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ పునరాగమనంలో అదరగొట్టింది. దాదాపు ఏడాది తర్వాత తాను పోటీపడ్డ తొలి టోర్నీ జాతీయ అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిష్టాత్మక ఆసియా క్రీడలకు అర్హత టైమింగ్ అందుకుంది. బుధవారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ హీట్ రేస్‌ను జ్యోతి 13.14 సెకన్లలోనే ముగించి ఆసియాడ్ బెర్త్ దక్కించుకుంది. తన ఈవెంట్‌లో ఆసియాడ్‌కు అర్హత సమయం 13.34 సెకన్లు కాగా.. అంతకంటే తక్కువ సమయంలోనే జ్యోతి పరిగెత్తడం విశేషం. విశాఖపట్నానికి చెందిన 26 ఏళ్ల జ్యోతి 2022 ఆసియా క్రీడల్లో రజతం సాధించింది. కాగా ఆసియా చాంపియన్, జాతీయ రికార్డు గ్రహీత గుల్వీర్ సింగ్ 5 వేల మీటర్ల రేసును 13 నిమిషాల 52.92 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. కానీ ఆసియాడ్‌కు అర్హత ప్రమాణమైన 13 నిమిషాల 39.18 సెకన్ల టైమింగ్‌ను మాత్రం దాటలేకపోయాడు.*

## అతనో 'సజీవ శిల్పం'



*డీఆర్ కాంగో, కొలంబియా మ్యాచ్‌లో.. స్టేడియంలోని స్టాండ్స్ వద్ద ఓ 'శిల్పం' అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే అది విగ్రహం కాదు.. ఓ అభిమాని అలా నిలుచున్నాడని తెలుసుకుని అంతా ఆశ్చర్యపోయారు. అతడి పేరు మైకేల్ ఎన్‌కుకా ఎంబోలాడింగ. ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్‌లో దివంగత నేత ప్యాట్రిస్ లుముంబా తరహాలో పోజిస్తూ విగ్రహంగా నిలుచొని ఫేమస్ అయ్యాడు. తాజాగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎర్రకోటు, పసుపు చొక్కా, బ్లూ ప్యాంట్ ధరించిన మైకేల్.. డీఆర్ కాంగో బెంచ్‌కు వెనుక ఓ దిమ్మెపై కదలకుండా విగ్రహంలా నిలుచున్నాడు. మ్యాచ్ సాగినంతసేపూ అతడు ఇలాగే ఉన్నాడు.*

# ప్రేమించి... పెళ్లాడి

### ఘనంగా టీమిండియా క్రికెటర్ ఆకాశ్‌దీప్ వివాహం

### వారణాసిలో అక్షితతో ఏడడుగులు



భారత జట్టు క్రికెటర్ ఆకాశ్‌దీప్ వివాహం బంధంలోకి అడుగు పెట్టాడు. అతడి పెళ్లి వారణసిలో అంగరంగ వైభవంగా జరిగింది. తన స్నేహితురాలు అక్షిత రాజ్‌కు మూడుముళ్లు వేసి ఆకాశ్ పరిణయమాడాడు. నగరంలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో జరిగిన వేడుకలో పెళ్లి దుస్తుల్లో అకాశ్‌దీప్ ఆకట్టుకున్నాడు. ఈ కార్యక్రమానికి భోజ్‌పురి సింగర్ పవన్ సింగ్, ఆకాశ్ మిత్రుడు, క్రికెటర్ ముఖేశ్ కుమార్ హాజరయ్యారు. పలువురు సెలబ్రిటీలు సైతం తరలివచ్చారు. ఆకాశ్, అక్షిత వివాహం ఇరు కుటుంబాల అంగీకారంతో సంప్రదాయ పద్ధతిలో జరిగింది. వీరి వివాహ వేడుకలు నాలుగు రోజుల క్రితమే ప్రారంభమయ్యాయి. వరుడి పూర్వీకుల నివాసం ఉన్న బడ్డీ గ్రామంలో పెళ్లికి ముందు సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత వివాహంలోని ప్రధాన వేడుకను వారణసిలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్ వేదికగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, సన్నిహితులను మాత్రమే ఆహ్వానించారు. ఇక వధువు విషయానికి వస్తే.. అక్షిత రాజ్ స్వస్థలం బిహార్‌లోని రోహ్‌తస్ జిల్లా. ఆమె బిట్స్ పిలానీలో బీసీఏ, ఎంసీఏ పూర్తి చేసింది. ఆకాశ్, అక్షిత ఫ్రెండ్స్‌గా ఉండి.. ఆ తర్వత ప్రేమలో పడ్డారు. చాలాకాలం పాటు ప్రేమించుకుని.. పెద్దలను ఒప్పించుకుని చివరకు పెళ్లితో ఒక్కటయ్యారు.



# వరల్డ్ కప్ ఎఫెక్ట్

### భారత్, ఐర్లాండ్ టీ20 సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు

భారత్, ఐర్లాండ్ పొట్టి సిరీస్ షెడ్యూల్ మారింది. ఇది వరకు ప్రకటించిన సమయానికంటే గంట ముందే మ్యాచ్‌లు జరగనున్నాయి. మహిళల టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌ల నేపథ్యంలో ఐర్లాండ్ క్రికెట్ (Ireland Cricket) ఈ నిర్ణయం తీసుకుంది. భారత్, తమ జట్టు మధ్య జరిగే రెండు టీ20ల సమయాన్ని మార్చినట్టు ఆ దేశ బోర్డు వెల్లడించింది. ఐర్లాండ్ పర్యటనలో శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత పురుషుల జట్టు రెండు టీ20ల సిరీస్ ఆడనుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి ఏడు గంటలకు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. 26న తొలి టీ20.. ఆపై ప్రపంచకప్‌లో సెమీస్ బెర్తుపై కన్నేసిన టీమిండియా జూన్ 28న ఆస్ట్రేలియాను ఢీకొట్టనుంది. లార్డ్స్ మైదానంలో ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు జరగనుంది. దాంతో రెండూ ఒకేసారి మొదలవ్వకూడదనే ఉద్దేశంతో.. ఆ రోజు భారత్, ఐర్లాండ్ గేమ్‌ను గంట ముందు అంటే.. సాయంత్రం 6 గంటలకు నిర్వహించేందుకు ఐర్లాండ్ క్రికెట్, బీసీసీఐ అంగీకరించాయి. టీమిండియా మ్యాచ్‌లను ప్రసారం చేసే సోనీ స్పోర్ట్స్ సైతం షెడ్యూల్ మార్పునకు ఆమోదం తెలిపింది.

అలానే... ఇంగ్లండ్ పర్యటనలోనూ భారత జట్టు ఐదు టీ20ల సిరీస్‌లో మ్యాచ్‌ల సమయం కూడా తేడాగా ఉంది. రెండు, నాలుగో టీ20లు రాత్రి 7గంటలకు జరగనుండగా.. మిగతా మూడు (ఒకటో, మూడో, ఐదో టీ20లు) మ్యాచ్‌లను రాత్రి 10 గంటలకు నిర్వహించనున్నారు. ఇక ఆగస్టులో మొదలయ్యే శ్రీలంక పర్యటన విషయంలోనూ బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. రెండు టెస్టుల సిరీస్‌కు అదనంగా మూడు టీ20 సిరీస్ ఉండదని స్పష్టం చేంది.

## ఇన్‌స్టా బయో మార్చిన టీ20 కెప్టెన్సీ శ్రేయస్ అయ్యర్




ఐర్లాండ్‌తో జరగబోయే రెండు టీ20ల సిరీస్‌తో టీమిండియా కెప్టెన్‌గా సరికొత్త బాధ్యతలు చేపట్టనున్న స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఈ ముఖ్యమైన సిరీస్‌కు ముందు అతడు తన అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ బయోను మార్చడం ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

తన ఇన్‌స్టాగ్రామ్ బయోలో Second DOB: 25.12.2025" (రెండో పుట్టిన తేదీ: 25.12.2025) అని ఒక ప్రత్యేకమైన డేట్ మెన్షన్ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నిజానికి శ్రేయస్ అయ్యర్ అసలు పుట్టిన తేదీ 1994 డిసెంబరు 6. కానీ తన క్రికెట్ కెరీర్‌పరంగా గత ఏడాది డిసెంబరు 25న తనకు 'రెండో లైఫ్' వచ్చినట్లు అయ్యర్ భావిస్తూ ఈ విధంగా రాసుకొచ్చాడు. దీంతో సోషల్ మీడియాలో అతడి అభిమానులు కామెంట్లతో ముంచెత్తుతున్నారు. శ్రేయస్ అయ్యర్ ఇన్‌స్టాగ్రామ్ బయో మార్పుపై ఒక అభిమాని సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు.

"శ్రేయస్ అయ్యర్ 25.12.2025 నాడు తీవ్రమైన గాయం నుంచి కోలుకుని మళ్లీ బ్యాట్ చేతబట్టాడు. ఒకానొక దశలో ప్రాణం పోయే పరిస్థితి నుంచి ఆయన బయటపడ్డారు. ఇది కేవలం క్రికెట్‌లోకి ఆయన పునరాగమనం చేసిన రోజు మాత్రమే కాదు.. తన జీవితంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిన రోజు. అందుకే అతడికి ఈ డేట్ చాలా స్పెషల్. అక్కడి నుంచే తన ప్రయాణాన్ని ఫ్రెష్‌గా మొదలుపెట్టి, క్రమశిక్షణతో ఎంతో కష్టపడి ఈరోజు కెప్టెన్సీ పగ్గాలు అందుకునే స్థాయికి చేరాడు" అని ఆ అభిమాని కొనియాడాడు. ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్ చేసిన ఈ మార్పు... అతడి పట్టుదలకు, కష్టపడేతత్వానికి నిదర్శనమంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# కింగ్ ఈజ్ బ్యాక్

### మళ్లీ బ్రెజిల్ జెర్సీలో నెయ్‌మార్ - ఫుట్‌బాల్ ప్రియుల్లో జోష్



ఫుట్‌బాల్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. బ్రెజిల్ ఫుట్‌బాల్ స్టార్, మాజీ కెప్టెన్ నెయ్‌మార్ దాదాపు మూడేళ్ల (981 రోజులు) సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి జాతీయ జట్టు జెర్సీ ధరించాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రూప్-సిలో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నెయ్‌మార్ మైదానంలోకి అడుగుపెట్టాడు. ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 3–0 తేడాతో బ్రెజిల్ ఘన విజయం సాధించగా.. జట్టు విజయం కంటే నెయ్‌మార్ పునరాగమనమే అభిమానుల్లో ఎక్కువ ఉత్సాహాన్ని నింపింది.

2023 అక్టోబరులో ఉరుగ్వేతో జరిగిన మ్యాచ్‌లో నెయ్‌మార్ మోకాలికి తీవ్ర గాయమైంది. ఆ తర్వాత సర్జరీ జరగడంతో సుదీర్ఘ విశ్రాంతి తీసుకున్నాడు. 34 ఏళ్ల వయసులో ఈ తరహా గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేయడం అంత సులువు కాదు. కానీ పట్టుదలతో శ్రమించిన నెయ్‌మార్.. మియామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి ప్రవేశించాడు. అతడు వార్మప్ చేస్తున్న సమయం నుంచే స్టేడియంలోని అభిమానులు కరతాళ ధ్వనులతో హోరెత్తించారు.

ఇక మ్యాచ్ అనంతరం నెయ్‌మార్ మాట్లాడుతూ... 'మూడేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జెర్సీని ధరించడం మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని ఇస్తోంది. శారీరకంగా నేను బాగున్నాను. ఇన్నాళ్లూ ఆటకు దూరం కావడం మానసికంగా నన్ను కలచివేసింది' అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలోట్టి వ్యూహం ప్రకారమే నెయ్‌మార్ రెండో అర్ధ భాగంలో బరిలోకి దిగాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ స్టార్ వినిసియస్ జూనియర్ రెండు అద్భుత గోల్స్‌తో మెరిశాడు. 'మా ఆరాధ్య ఆటగాడు జట్టులోకి రావడం మాకందరికీ కొండంత బలాన్నిచ్చింది. అతడు మరింత రాణించి ఈ టోర్నీలో మాకు అండగా నిలుస్తాడని ఆశిస్తున్నాను' అని వినిసియస్ పేర్కొన్నాడు. నెయ్‌మార్ రాకతో బ్రెజిల్ శిబిరంలో సరికొత్త జోష్ నెలకొంది.

## ఎడిటర్ శ్రీకర ప్రసాద్‌కు
# ఆస్కార్‌లో అరుదైన గౌరవం




ప్రముఖ ఎడిటర్ శ్రీకర ప్రసాద్‌కు అత్యుత్తమ గౌరవం దక్కింది. అకాడమీ అవార్డ్స్ సభ్యునిగా ఎంపిక చేయడంతో ఆయనకు ఆస్కార్ నామినేషన్స్‌కు వచ్చే సినిమాలకు ఓటు వేసే ఆస్కారం లభించింది. దేశ సినీరంగ పితామహుడు, దివంగత ఎల్.వి.ప్రసాద్ సోదరుడు, దర్శక, ఎడిటర్ అక్కినేని సంజీవి తనయుడే శ్రీకర ప్రసాద్. తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ, శ్రీకర ప్రసాద్ సైతం ఎడిటర్‌గా చిత్ర సీమలోకి అడుగు పెట్టారు. గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో ఆయన వివిధ భాషల్లో ఆరు వందలకు పైగా చిత్రాలకు ఎడిటర్‌గా వర్క్ చేశారు.

విశేషం ఏమంటే... శ్రీకర ప్రసాద్ తనయుడు సైతం చిత్రసీమలోనే దర్శకుడిగా రాణిస్తున్నారు. ఆస్కార్ బరిలో నిలిచి,బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డును అందుకున్న 'ఆర్.ఆర్.ఆర్.' సినిమాకు శ్రీకర ప్రసాదే ఎడిటర్‌గా ఉన్నారు. అలానే ఆయన పలు ప్రతిష్ఠాత్మక హిందీ, తమిళ చిత్రాలకు పనిచేశారు. ఈ యేడాది ఆస్కార్స్ అకాడమీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 529మందిని కొత్తగా సభ్యులుగా తీసుకుంది. వీరందరికీ అకాడమీ అవార్డులలో ఓటు హక్కు లభిస్తుంది. ఈ జాబితాలో ఎడిటర్‌గా విశేషమైన సేవలు అందించిన శ్రీకర ప్రసాద్‌కూ చోటు దక్కడం విశేషం.

# మున్నా భయ్యా ఆగయా!




యువతను విశేషంగా ఆకట్టుకున్న వెబ్‌సిరీస్‌ల్లో 'మీర్జాపూర్ ఒకటి.యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్ ప్రైమ్ వీడియో వేదికగా విడుదలై ఘనవిజయం సాధించింది.ఇప్పుడీ సిరీస్ ఆధారంగా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'మీర్జాపూర్ ది మూవీ'పేరుతో తెరకెక్కిన ఈసినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదలచేశారు. మూడు సిరీస్‌లకు ప్రీక్వెల్‌గా సినిమా ఉంటుందని గతంలోనే నిర్మాణ బృందం తెలిపింది. సిరీస్ మూడుభాగాల్లో చనిపోయిన వారంతా తెరపై కనిపిస్తారని వెల్లడించింది. ఇక ఈ సిరీస్‌ల్లో అత్యంత ప్రేక్షకాదరణ పొందినపాత్ర మున్నా.. టీజర్‌లో కనిపించడంపై అభిమానులు ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు. 'మున్నా భయ్యా వచ్చేశాడు' అంటూ ఆనందం వ్యక్తం చేశారు. క్రైమ్, థ్రిల్లర్ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లకు గుర్మీత్ సింగ్ దర్శకత్వం వహించారు. తొలి సీజన్ 2018 నవంబరు 16న విడుదలైంది. పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, దివ్యేందు శర్మ, అలీ ఫజల్, శ్రియ పిల్గోంగర్, హర్షిత గౌర్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. దీనికి సీక్వెల్‌గా 2020, 2024లో మరో రెండు సిరీస్‌లు విడుదలయ్యాయి.

## 'ఓజీ 2' పనులు ప్రారంభం

పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఓజీ' భారీవిజయం సాధించిన సంగతి తెలిసిందే. సుజీత్ దర్శకత్వంలో దీనికి పార్ట్ 2 కూడా ప్రకటించారు.పార్ట్ 2కి సంబంధించిన పనులు ప్రారంభమైనట్లు తెలుపుతూ మేకర్స్‌స్పెషల్ వీడియో విడుదల చేశారు. 'తుపాను రావడానికి ముందు.. నిశ్శబ్దం ఉంటుంది.. 'గంభీర కథ సిద్ధమవుతోంది ' అని పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. పవన్, సుజీత్ స్టోరీ గురించి చర్చించుకుంటున్న ఈ వీడియోలో 'నేను రెడీ..' అని సుజీత్‌తో పవన్ చెప్పడం అభిమానులను, ఆకట్టుకుంటోంది. ఐతే 'ఓజీ2'లో పవన్ కళ్యాణ్‌కు ఒక పెట్ కూడా ఉంటుందని వెల్లడించారు.

# రాజమౌళి విజన్, పనితీరు అద్భుతం..
## పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రశంసలు



దర్శక ధీరుడు రాజమౌళిలో మంచి నటుడు కూడా ఉన్నాడని మళయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రశంసలు కురిపించాడు. ఏదైనా పాత్ర గురించి సెట్‌లో వివరించే సమయంలో రాజమౌళి ఆ పాత్రలో పూర్తిగా లీనమై అవసరమైన ఎమోషన్లన్నీ ముఖంలో పలికిస్తూ నటీనటులకు వివరిస్తాడన్నారు. ఆయనలోని అద్భుత నటుడి గురించి ఎంత వివరించానా తక్కువేనన్నారు. అదే విధంగా షాట్ పర్‌ఫెక్షన్ కోసం ఆయన పడే తపన, తీసుకునే శ్రమ గురించి మాటల్లో చెప్పలేనన్నారు.

భారతీయ చిత్రసీమలో ప్రస్తుతం అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న భారీ ప్రాజెక్టుల గురించి మాట్లాడుకుంటే, ముందుగా వినిపించే పేరు సూపర్ స్టార్ మహేష్ బాబు, రాజమౌళిల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'వారణాసి'. ఈ సినిమాపై కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా భారీ అంచనాలు ఉన్నాయి. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న ఈ ప్రాజెక్టులో మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నెగెటివ్ రోల్ పోషిస్తున్నారు. తన తాజా సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉన్న ఆయన, ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాలో తన పాత్రతో పాటు రాజమౌళితో పనిచేసిన అనుభవాల గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకోగా, ఆ వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

ఆ ఇంటర్వ్యూలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ, తాను ఇప్పటివరకు సినీ పరిశ్రమలో ఎంతోమంది దర్శకులతో పనిచేశానని, వారందరిలో రాజమౌళినే అత్యుత్తమ యాక్టర్-డైరెక్టర్ అని ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన విజన్, పనితీరు అద్భుతంగా ఉంటాయని కొనియాడారు. 'వారణాసి' సినిమా విజువల్స్, దాని రేంజ్ గురించి వర్ణిస్తూ... ఈ ప్రాజెక్టును కేవలం 'భారీ' అనడం కూడా చాలా చిన్న మాటే అవుతుందని వ్యాఖ్యానించారు. ఆ పదం ఈ సినిమా అసలు స్థాయిని పూర్తిగా వివరించలేదని ఆయన చేసిన ఈ కామెంట్స్ సినిమాపై అభిమానుల్లో మరింత హైప్ పెంచుతున్నాయి.

ఇదే క్రమంలో వారణాసిలో ఒక పర్టికులర్ షాట్ కోసం ఏకంగా 94 టేకులు తీసుకున్నామని పృథ్వీరాజ్ చెప్పారు. నటీనటుల నుంచి తనకు వంద శాతం పర్ఫెక్ట్ అవుట్‌పుట్ రాబట్టుకోవడం కోసం జక్కన్న ఎంతగానో శ్రమిస్తారనే కథనాలు గతంలో కూడా మనం చాలానే విన్నాము. అయితే, ఒక ప్రముఖ స్టార్ నటుడు స్వయంగా ఈ రేంజ్ డెడికేషన్ గురించి చెప్పడం ఇప్పుడు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. పర్ఫెక్షన్ కోసం రాజమౌళి పడే తపనకు తానెంత గానో ఫిదా అయ్యానని పృథ్వీరాజ్ చెప్పడం ఆయన పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. నేను ఇప్పటి వరకూ రాజమౌళిలా కష్టపడే దర్శకుడిని చూడలేదు. ఉదయం 7 గంటలకు మొదటి షాట్ ఉంటే ఆయన 5:15 గంటలకే సెట్స్‌కు చేరుకుంటారు. నేను, మహేష్, ప్రియాంక సెట్స్‌కు వచ్చేసరికి ఆయన తన అసిస్టెంట్లతో కలిసి కనీసం 12సార్లు రిహార్సల్స్ పూర్తిచేసి, కెమెరా క్రేన్లను సిద్ధంగా ఉంచుతారు. మమ్మల్ని కూడా ఉదయమే రమ్మంటారా అని అడిగితే వద్దు అని చెబుతారు. లంచ్ బ్రేక్ కూడా 20 నిమిషాలు మాత్రమే ఇస్తారు. ప్రతిరోజూ ఆయన సెట్ కు వచ్చేటప్పుడు, ఇది తన తొలి సినిమా అన్నంత కసితో, ఉత్సాహంతో పనిచేస్తారని వివరించారు. అంతేకాకుండా, తాను ఇప్పటివరకు తీసిన సినిమాల్లో ఇదే అత్యంత భారీ చిత్రం అని స్వయంగా రాజమౌళే తనతో చెప్పారని పృథ్వీరాజ్ వెల్లడించడం విశేషం. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' లాంటి గ్లోబల్ బ్లాక్‌బస్టర్స్ తరువాత వస్తున్న సినిమా కావడంతో, 'వారణాసి' వెనుక ఉన్న ఆశయం ఏంటో మనకు అర్థమవుతోంది. మహేష్ బాబు అభిమానులతో పాటు యావత్ భారతీయ ప్రేక్షకులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం ఎప్పుడు విడుదలైనా రికార్డుల మోత మోగించడం ఖాయంగా కనిపిస్తోంది.

# సినిమా చేయాలంటే 15 షరతులు పెట్టింది..



తెలుగమ్మాయికి సినిమలో హీరోయిన్‌గా అవకాశం ఇద్దామని అడిగితే 15 షరతులు పెట్టిందని ప్రముఖ నిర్మాత బన్నీవాస్ చమత్కరించారు. డైరెక్టర్ సుకుమార్ నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్, యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ నిర్మాణ సంస్థ బన్నీ వాస్ వర్క్స్.. సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రియదర్శి హీరోగా నటిస్తోన్న ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్‌టైనింగ్ డ్రామాగా ఈ సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో నిర్మాత బన్నీ వాసు.. హీరోయిన్ నాగదుర్గ గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. చాలా మంచి కథతో ఈ సినిమా చేస్తున్నాం. సబ్ టైటిల్స్‌తో ఈ సినిమాను బీహార్ ప్రదర్శించినా అక్కడ ప్రేక్షకులు కూడా చూసేంత గొప్ప చిత్రమిది. మన అందరి ఇళ్లలో ఒక కామన్ ప్రాబ్లమ్ ఉంటుంది. అదేంటనేది పెళ్లయిన వారికి బాగా తెలుసు. ఈ సినిమా రిలీజ్ అయ్యాక అమ్మాయి అయితే వాళ్ల అత్తామామలను తీసుకుని థియేటర్‌కు వెళ్లండి.. అబ్బాయి అయితే వాళ్ల అత్తామామలను తీసుకుని విడిగా థియేటర్‌కు వెళ్లండి. బయటకు వచ్చాక మీ అత్త మీ చేతులు పట్టుకుంటుంది. అల్లుడి చేతులు మామగారు పట్టుకుంటారు. అంతవరకు ఈ కథను చెప్పగలను. ఈ కథ వినగానే ఎంత బిజీగా ఉన్నా సరే.. మేము చేస్తామంటూ నటీనటులందరూ ముందుకు వచ్చారు. జమ్మికుంట నుంచి వచ్చాడు దర్శకుడు వంశీ. 'ఇడుపు కాయితం'తో ఒక మంచి తెలుగు సినిమా చూడబోతున్నాం.

నేను, సుకుమార్ కలిసి ఒక సినిమా నిర్మిస్తుంటే.. ఈ సినిమాలో ఎవరైనా సరే.. హ్యాపీగా వచ్చి చేస్తారనుకున్నా. కానీ హీరోయిన్ నాగదుర్గ మాకు 15 కండీషన్స్ పెట్టింది. తెలుగమ్మాయి ఒక సినిమా చేస్తుంటే.. ఏం చేయగలను, ఏం చేయలేను అని ఎంత క్లారిటీగా ఉంటుందనేది నాగదుర్గతో మాట్లాడిన తర్వాత అర్థమైంది. ఈ అమ్మాయి గురించి మేమందరం మారాం. ఎందుకంటే, ఈ అమ్మాయి సినిమాకు అంత ఇంపార్టెంట్. 100 పర్సంట్ ఈ అమ్మాయి అయితేనే ఈ సినిమాకి చాలా ప్లస్ అవుతాది. నాగదుర్గ ఇప్పటికే యూట్యూబ్‌లో మంచి పేరు తెచ్చుకుంది. ఆమె కోసం ఒక స్పెషల్ ట్యూన్ చేయిస్తున్నాం. ఆ డ్యాన్స్ గీతానికి థియేటర్లు దద్దరిల్లాల్సిందే. ఈ సినిమా కథను మా వరకు తెచ్చి, మేమంతా కలిసి ఈ మూవీ చేసేలా చేసింది హీరో ప్రియదర్శి. నేను ఈ మూవీ చేయకపోయి ఉంటే ఒక మంచి కథను మిస్ అయ్యేవాడిని. రైట్ టైమ్‌లో నా దగ్గరకు వచ్చిన రైట్ ప్రాజెక్ట్ ఇది.. అని బన్నీ వాసు చెప్పారు.



## 'ధర్మన్'.. ది ఓజీ స్వాగ్

అగ్ర కథానాయకుడు రజనీకాంత్.. 'ధర్మన్'.. ది డెడ్లీ డాక్టర్ అంటూ తన 173వ సినిమాతో సందడి చేయనున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని మరో అగ్రనటుడు కమల్ హాసన్ నిర్మిస్తున్నారు. సిమ్రాన్, రాశీఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇందులో తలైవా న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్ పోస్టర్ మేకింగ్ వీడియోను 'ది ఓజీ స్వాగ్' అనే క్యాప్షన్‌తో చిత్ర బృందం విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వస్తోంది.